ANN తెలుగు
Follow: @ANNTELUGU
16-10-2025
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 311 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్



## చెట్టు పేరు చెప్పుకుని బతికే ఉద్దేశం లేదు

- ఇక కవితగానే జనంలోకి...
- కేసీఆర్ ఫొటో ఇక వాడేది లేదని ప్రకటన
- నాలుగు నెలలు జాగృతి జనంబాట


02



## సస్పెన్స్‌కు తెరదించిన బీజేపీ

- జూబ్లీహిల్స్ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీ
- అధికారికంగా ప్రకటించిన పార్టీ

02



## ప్రధాని మోదీ నేడు శ్రీశైలం క్షేత్రానికి...

- తొలిసారి మల్లిఖార్జునుడి దర్శనానికి..
- రూ.13,430 కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టులు

03

SRI GOLD
TRUSTED GOLD BUYERS

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,29,440 |
| 22 క్యారెట్ | 1,18,650 |
| సిల్వర్ (కేజీ) | 1,90,000 |

# రూటు మార్చిన సీఎం రేవంత్




- కేసీఆర్ బాటలో పరామర్శలు
- ఎమ్మెల్యేలతో అనుబంధం
- ఎన్నికలపై.. పార్టీపై ఫోకస్

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూటు మార్చారు. అందరివాడుగా పేరున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇపుడు ఎమ్మెల్యేలతో అనుబంధానికి మరింత సమయం వెచ్చిస్తున్నారు. తొలి ఏడాది పాలనకు భిన్నంగా ప్రధానంగా గత నెలరోజులుగా.. సీఎం రేవంత్ పర్యటనలు, షెడ్యూల్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలలో ఉత్సాహం కలిగిస్తున్నది. గతంలో సీఎంగా ఉన్నపుడు కేసీఆర్ ఎమ్మెల్యే ఎవరు చనిపోయినా వారి దశదిన కర్మ సమయంలో ఖచ్చితంగా వారి ఇంటికి వెళ్ళి ఎమ్మెల్యేను పరామర్శించే వారు. భరోసానిచ్చేవారు. సీఎం మొదట్లో ఈ సంప్రదాయాన్ని పట్టించుకోకపోయినా, ఫీడ్ బ్యాక్ ఆధారంగా దీనిని మార్చుకున్నట్లు కనబడుతోంది. ఇటీవల నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాతృమూర్తి మరణించగా, సీఎం స్వయంగా నిజామాబాద్ జిల్లాకు వెళ్ళి భూపతిరెడ్డిని పరామర్శించారు. దశదిన కర్మలో పాల్గొన్నారు.

మిగతా 2లో

### బైపోల్ పై ఫోకస్

జూబ్లీహిల్స్ బైపోల్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా పనిచేస్తున్నారు. స్థానికంగా బలమైన నేత నవీన్ యాదవ్ కు టికెట్ ఇవ్వడం ద్వారా జిల్లాలో సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీశారు. బీసీ పాలిటిక్స్ జరుగుతున్న నేపథ్యంలో బీసీకి టికెట్ ఇచ్చిన ఏకైక ప్రధాన పార్టీగా కాంగ్రెస్ నిలిచింది. అభ్యర్థి ఎంపిక నుండి ప్రచారం , ఇన్ ఛార్జిలకు బాధ్యతలు, డైలీ పీడ్ బ్యాక్ పై తరచూ సమీక్షిస్తున్నారు. జూబ్లీహిల్స్ లో గెలుపు ద్వారా స్థానిక ఎన్నికలు, జీహెచ్ ఎంసీ ఎన్నికలకు కూడా ఏకపక్షం చేసుకోవాలన్న వ్యూహంతో ఉన్నట్లు కనబడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ పరిపాలన, విధానాలపై నగర ఓటర్లు సంతృప్తి గా ఉన్నట్లు కనబడుతోంది. సిటీలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా బలపడింది. పార్టీకి దూరమైన సామాజిక వర్గాలు దగ్గరకు వస్తున్నాయి.




# జూబ్లీహిల్స్ .. ట్రయాంగిల్ ఫైట్

## మూడు పార్టీల బలాలు.. బలహీనతలు

(మహా ప్రత్యేకం)

జూబ్లీహిల్స్.. జూబ్లీహిల్స్. ఇది హైదరాబాద్ సిటీనే కాదు.. రెండు తెలుగురాష్ట్రాలకు హార్ట్ లాంటి నియోజకవర్గం. జూబ్లిహిల్స్ ప్రాంతంలోనే ఎంతోమంది వీవీఐపిలు ఉంటారు. బైపోల్స్ కు తెలుగునాట స్పెషల్ క్రేజ్ ఉంటుంది. తెలంగాణ అయినా, ఆంధ్ర అయినా.. ఎక్కడ బైపోల్ ఉన్నా.. రెండు రాష్ట్రాల రాజకీయాల్లో ఎంతో ఆసక్తి ఉంటుంది. ఇక అది సెంటర్ అయితే.. అందరూ రెగ్యులర్ గా తిరిగే నడిబొడ్డు అయితే.. ఆ క్రేజ్, ఉత్కంఠ వేరు. ఇపుడు అదే ఉత్కంఠ జూబ్లీహిల్స్ లో హైఓల్టేజ్ మంటలు పుట్టిస్తోంది. ఒక దుబ్బాక అయినా.. ఒక హుజూరాబాద్ అయినా.. ఒక మునుగోడు అయినా.. ఒక పాలేరు అయినా.. ఒక నంద్యాల అయినా.. అవి పుట్టించిన మంటలు వేరు. మార్చిన రాజకీయ సమీకరణాలు వేరు.

మిగతా 2లో

# తెలంగాణ ఆల్ టైం రికార్డు

- 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం
- 29 రాష్ట్రాల్లో ఇంతటి ధ్యానం దిగుబడి ఏనాడు రాలేదు
- రాష్ట్ర వ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు: మంత్రి ఉత్తమ్
- వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై మంత్రులు ఉత్తమ్, తుమ్మల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

02



## ఐటీ మంత్రికి అరుదైన గౌరవం

- 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో కీలకోపన్యాసం
- దేశంలో ఈ గౌరవం దక్కిన ఏకైక మంత్రి శ్రీధర్ బాబు మాత్రమే

వివరాలు 2లో



## నేడు క్యాబినెట్ సమావేశం

- బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై డిస్కషన్
- సాగునీటి ప్రాజెక్టులు, మూసీ, మెట్రోపై కూడా చర్చ

వివరాలు 2లో

| స్టాక్ మార్కెట్ | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 82,605.43 |
| నిఫ్టీ ↗ | 25,323.55 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5 | 150 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5 | 150 |
| రిటైల్ గుడ్డు ధర | 5.3 | 159 |


# అజ్ఞాతం వీడి జన జీవనంలోకి...

## మహారాష్ట్ర సీఎం ఎదుట లొంగిపోయిన మావో అగ్ర నేత మల్లోజుల

54 ఆయుధాలతో సహా సరెండర్ అయిన 61 మంది మావోయిస్టులు

గడ్చిరోలి జిల్లాలో సభ.. ఆయ వ్యక్తులపై ఉన్న రివార్డులు అందజేసిన ఫడ్నవీస్

**మహారాష్ట్ర, మహా:** మావోయిస్టు పార్టీ ఉద్యమ చరిత్రలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ పార్టీలో దశాబ్ధాలుగా పని చేస్తూ, కేంద్ర కమిటీలో కీలకంగా ఉన్న సీనియర్ నేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ భూపతి లొంగిపోయారు. బుధవారం గడ్చిరోలి జిల్లాలో మరో 61 మంది కార్యకర్తలతో కలిసి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో ఈ లొంగుబాటు జరిగింది. లొంగిపోయిన నక్సల్స్ 54 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇందులో ఏడు ఏకే 47, తొమ్మిది ఇన్సాస్ రైఫిల్స్ ఉన్నాయి. భూపతి అలియాస్ సోనూ మావోయిస్టు సంస్థలో అత్యంత ప్రభావవంతమైన వ్యూహకర్తలలో ఒకరిగా పరిగణించబడ్డారు. మహారాష్ట్రఛత్తీస్గఢ్ సరిహద్దులో



ప్లాటూన్ కార్యకలాపాలను సుదీర్ఘంగా పర్యవేక్షించాడు. మల్లోజులపై రూ.6 కోట్ల రివార్డు ఉన్నట్లు గడ్చిరోలి పోలీసులు ప్రకటించారు. పార్టీలో అభయ్, సోను, భూపతి, వివేక్ పేర్లతో పిలిచేవారు.

మిగతా 2లో



## అతి పెద్ద డ్రగ్స్ సప్లయర్ కేటీఆరే..

- జూబ్లీహిల్స్‌లో ఆ దందాకు తెరలేపింది ఆయన కాదా?
- కేటీఆర్ పై ఎంపీ అరవింద్ సంచలన ఆరోపణలు
- ఆర్వోబీల నిధులు విడుదల చేయకుంటే నిరాహార దీక్ష చేపడతా అని హెచ్చరిక

02

## వైరా వేర్‌హౌస్‌లో అక్రమాల దందా

- సంచలనం సృష్టించిన మహాపత్రిక కథనం
- ఐదుగంటల పాటు విచారించిన జీఎం
- మిల్లర్ల మాఫియా.. రికార్డుల్లో గోల్‌మాల్, తప్పడు ఎంట్రీలు
- స్పందించిన కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు


02

## బీసీ వ్యతిరేకి బీజేపీ

ఇది కిషన్‌రెడ్డి రాజ్యం

ఎమ్మెల్యే రాజాసింగ్ ఫైర్

వివరాలు 3లో



# రూటు మార్చిన సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ముఖ్యనేత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణించగా, స్వయంగా సూర్యాపేట వెళ్ళి ఆయన కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు ఎస్సారెస్పీ2కు దామోదర్ రెడ్డి పేరు ప్రకటించారు. బుధవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి ఇటీవల మరణించగా, సీఎం రేవంత్ రెడ్డి దశదిన కర్మకు హాజరై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. గత రెండేళ్ళుగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేకంగా ఉండడంతో పాటు వరంగల్ జిల్లాలో జరిగిన సీఎం పర్యటనలకు కూడా హాజరుకాలేదు. కానీ సీఎం రేవంత్ రెడ్డి దొంతి మాధవ రెడ్డి కుటుంబ కార్యక్రమానికి హాజరవడం ద్వారా కలిశారు. ఇది పార్టీలో ఉత్సాహాన్ని నింపింది. నారాయఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కుమారెడి వివాహ నిశ్చితార్థానికి సీఎం హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యుల ఇళ్ళలోని కార్యక్రమాలకు సీఎం స్వయంగా హాజరవడం, ఆయా నేతల క్యాడర్ లో.. జిల్లాల్లో పార్టీ నేతలకు భరోసానిస్తోంది. ఇది మంచి పరిణామంగా నేతలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ బైపోల్, త్వరలో స్థానిక ఎన్నికలు, డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ నేపథ్యంలో జిల్లాల్లో పార్టీపైనా సీఎం రేవంత్ ఫోకస్ పెట్టారు. ఆ పరిణామాలు కనబడుతున్నాయి. పార్టీ యంత్రాంగంలో భరోసా నింపేలా, నేతలను బలోపేతం చేసేలా సీఎం కార్యక్రమాలు భవిష్యత్తుపై నేతలకు సంతోషం కలిగిస్తున్నాయి.

# తెలంగాణ ఆల్ టైం రికార్డు

- 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం
- 29 రాష్ట్రాల్లో ఇంతటి ధాన్యం దిగుబడి ఏనాడు రాలేదు
- రాష్ట్ర వ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు: మంత్రి ఉత్తమ్
- వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై మంత్రులు ఉత్తమ్, తుమ్మల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, మహా:** ధాన్యం దిగుబడిలో తెలంగాణ ఆల్ టైం రికార్డు సృష్టించిందని, దేశంలోని 29 రాష్ట్రాల్లో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇంతటి దిగుబడి ఏనాడు రాలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై సచివాలయం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సునిషితమైన అంశమని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎక్కడ అసౌకర్యం కలుగకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. 148.03 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితో వ్యవసాయ చరిత్రలోనే రికార్డు నమోదు చేసుకోవడమే కాకుండా.. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం సరికొత్త రికార్డు అవుతుందని అన్నారు. రూ.23 వేల కోట్లను వెచ్చించి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. అందులో 40 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు, 40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకాలు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో 4,259 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 3,517 ఐకేపీ కేంద్రాల ద్వారా ఇతర సంస్థల ద్వారా మరో 566 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేందుకు రవాణా వసతి ఏర్పాటు చేసుకోవాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్‌ను అందిస్తామని స్పష్టం చేశారు.ఇప్పటికే కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, నల్గొండ జిల్లాలో 1,205 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 నుంచి 72 గంటల వ్యవధిలో రైతులకు నగదు చెల్లింపులకు వీలుగా తూకం నుంచి డేటా ఎంట్రీ వరకు సమయపాలన పాటించాలన్నారు. వర్షం వస్తే ధాన్యం చెడిపోకుండా ఉండేందుకు గాను టార్పాలిన్లను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇబ్బందులు తలెత్తితే 1800 42500333/1967 హెల్ప్‌లైన్ నెంబర్లు రైతులు ఫోన్ చేయాలన్నారు. గడిచిన రెండేళ్లుగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేశామన్నారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. ప్రస్తుత వానాకాలంలో ముందెన్నడూ లేని రీతిలో ధాన్యం దిగుబడి వచ్చిన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ, సహకార శాఖలు సమన్వయం చేసుకొని క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రత్యేక దృష్టితో సారించాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# చెట్టు పేరు చెప్పకుని బతికే ఉద్దేశం లేదు

## ఇక కవితగానే జనంలోకి..

- కేసీఆర్ ఫొటో ఇక వాడేది లేదని ప్రకటన
- నాలుగు నెలలు జాగృతి జనంబాట




**హైదరాబాద్, మహా :** చెట్టు పేరు చెప్పుకొని బతికే ఉద్దేశం తనకు లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సంచలన నిర్ణయం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేయాలని కవిత నిర్ణయించారు. ఈ మేరకు జాగృతి జనంబాట పోస్టర్ ను ఆమె ఆవిష్కరించారు. అక్టోబర్ 25 నుంచి ఫిబ్రవరి 13 వరకు నాలుగు నెలల పాటు 33 జిల్లాల్లో యాత్ర నిర్వహించనున్నారు. అయితే ఈ యాత్రలో కేసీఆర్ ఫోటోను పెట్టుకోవటం లేదని కవిత స్పష్టం చేశారు. జాగృతి కార్యక్రమాల్లో కేసీఆర్ ఫోటోను పెట్టుకున్నాం కానీ ఇప్పుడు తాను ఆ పార్టీలో లేను కాబట్టి... అందుకే తన తరపున క్లారిటీ ఇస్తున్నానని తెలిపారు. చెట్టు పేరు చెప్పుకొని బతికే ఉద్దేశం తనకు లేదన్నారు కవిత. ఆ చెట్టు నీడ లో ఉన్నంత వరకు దుర్మార్గుల బారి నుంచి చెట్టును కాపాడేందుకు ఎంతో ప్రయత్నం చేశానని చెప్పుకొచ్చారు. తాను నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసే వరకు జాగృతిలో కేసీఆర్ గారి ఫోటో పెట్టలేదని కవిత చెప్పారు తన దారిలో తాను వెళ్తుండగా కేసీఆర్ ఫోటో పెట్టుకోవటం నైతికంగా సరికాదన్నారు

### నిజామాబాద్ నుండి షురూ...

అక్టోబర్ 25 నుంచి నిజామాబాద్ నుంచి జాగృతి జనం బాట ప్రారంభం కానుందని కవిత వెల్లడించారు. తాను జనం ఏం చెబుతారో వినాలనే జనం బాట కార్యక్రమం చేపడుతున్నానని కవిత చెప్పుకొచ్చారు. ప్రజల దగ్గరకు వెళ్లి వాళ్లు చెప్పే మాటలు వినాలని నిర్ణయించుకున్నానని వెల్లడించారు. తెలంగాణ వస్తే ఏం కావాలని ప్రజలు కోరుకున్నారో... ఏం జరిగిందో, ఏం జరగాలని కోరుకుంటున్నారో తెలుసుకోవాలనుకుంటున్నా అని కవిత తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోతో కవిత యాత్రను చేయనున్నారని, బీసీ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ఈ యాత్రకు ప్లాన్ చేసినట్లుగా టాక్ నడుస్తోంది. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు చిన్న విషయం అన్న కవిత.. తెలంగాణ అనేదే పెద్ద అంశమని కవిత చెప్పుకొచ్చారు. పార్టీ తనను సస్పెండ్ చేశాక ఎమ్మెల్సీ పదవి పైన తనకు వ్యామోహం పోయిందన్నారు.

# నేడు క్యాబినెట్ సమావేశం

- బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై డిస్కషన్
- సాగునీటి ప్రాజెక్టులు, మూసీ, మెట్రోపై కూడా చర్చ

**హైదరాబాద్, మహా:** నేడు రాష్ట్ర మంత్రివర్గం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం కానుంది. సచివాలయం ఆరో అంతస్తులోని క్యాబినెట్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో ప్రధానంగా బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలు, సాగునీటి పారుదల ప్రాజెక్టులు, ధాన్యం సేకరణ, మెట్రో రైలు ప్రాజెక్టు తదితర అంశాలు చర్చకు రానున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 అమలుపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు ఆటంకం ఏర్పడింది. హైకోర్టు స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ గురువారమే విచారణకు వచ్చే అవకాశం ఉంది. అదే రోజు మంత్రివర్గ సమావేశం జరుగుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక మెట్రో రైలు ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతల నుంచి ఎల్‌అండ్‌టీ సంస్థ వైదొలగడంతో ప్రభుత్వమే నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది. దీంతోపాటు మూసీ ప్రాజెక్టు, గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం, టీఫైబర్ విస్తరణ, ఫ్యూచర్ సిటీ అంశాలు క్యాబినెట్ భేటీలో చర్చకు రానున్నాయి. వివిధ సాగునీటి పారుదల ప్రాజెక్టుల అంచనాలను పెంచే అంశంపైనా చర్చించవచ్చని సమాచారం. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం, సమ్మక్కసారలమ్మ ఆనకట్ట, దేవాదుల ఆరో ప్యాకేజీ వంటి విషయాలు చర్చకు రానున్నట్లు తెలిసింది.

# అతి పెద్ద డ్రగ్స్ సప్లయర్ కేటీఆరే..

## జూబ్లీహిల్స్‌లో ఆ దందాకు తెరలేపింది ఆయన కాదా?

## కేటీఆర్ పై ఎంపీ అరవింద్ సంచలన ఆరోపణలు

### ఆర్వోబీల నిధులు విడుదల చేయకుంటే నిరాహార దీక్ష చేపడతా అని హెచ్చరిక

**నిజామాబాద్, మహా:** జూబ్లీహిల్స్‌లో ఓట్ల చోరీ జరిగిందని కేటీఆర్ అనటం హాస్యాస్పదమని ఎంపీ అర్వింద్ అన్నారు. రాష్ట్రంలో దొంగ ఓట్లు తెచ్చిందే బీఆర్ఎస్ పార్టీ అని ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాలో ఆర్వోబీల నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్వోబీల నిధులు విడుదల చేయకుంటే పదిరోజుల్లో నిరాహార దీక్ష చేపడతామని.. దీపావళి వరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమయం ఇస్తున్నా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ డెడ్‌లైన్ విధించారు.మాధవనగర్ ఆర్వోబీ పనులకు నిధులు విడుదల చేయకపోతే నిరాహార దీక్షచేస్తా. ఆర్వోబీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆర్వోబీలకు నిధులు కేంద్రం ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వాళ్ల అవసరాలకు వాడుకుందని అరవింద్ ఆరోపించారు.

### పసుపు బోర్డు కోసం స్థలం అడిగితే ఇవ్వడం లేదు..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎంపీ అరవింద్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్‌లో ఓట్ల చోరీ జరిగిందని కేటీఆర్ అనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. రాష్ట్రంలో దొంగ ఓట్లు తెచ్చిందే బీఆర్ఎస్ పార్టీ, జూబ్లీహిల్స్ అపార్టుమెంట్లో 43ఓట్లు దొంగ ఓట్లు అయితే, బోధన్‌లో బీఆర్ఎస్ హయాంలో 42దొంగ పాసుపోర్టులు ఇచ్చిన సంగతి మరిచారా అంటూ ఎంపీ అరవింద్ విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో డ్రగ్స్, మత్తు పదార్థాల దందాకు తెరలేపింది కేటీఆర్ కాదా అంటూ



ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ క్లబ్బుల్లో డ్రగ్స్ సరఫరా చేసింది కేటీఆర్ అని ఎంపీ అరవింద్ విమర్శించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందని, బీసీ రిజర్వేషన్ల వ్యవహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సరిగా చేయలేదని, ఈ అంశంలో బీజేపీని కార్నర్ చేసే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ఎంపీ అరవింద్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్‌కు 20కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని అధికారులు బిల్లులు చెయడం లేదు. జిల్లా కలెక్టర్ తన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నా.. జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గద్దని అరవింద్ సూచించారు. జాతీయ పసుపు బోర్డు కోసం స్థలం అడిగితే ఇవ్వడం లేదని అరవింద్ విమర్శించారు.

# ఐటీ మంత్రికి అరుదైన గౌరవం

- 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో కీలకోపన్యాసం
- దేశంలో ఈ గౌరవం దక్కిన ఏకైక మంత్రి శ్రీధర్ బాబు మాత్రమే

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. లైఫ్ సైన్సెస్ రంగంలో 'ఆసియాపసిఫిక్' ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా పరిగణించే 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ఆయన కీలకోపన్యాసం చేయనున్నారు. ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ ఈ మేరకు ఆహ్వానం పలికారు. దేశంలో ఈ గౌరవం దక్కిన ఏకైక మంత్రి శ్రీధర్ బాబు కావడం గమనార్హం. ఈ నెల 21 నుంచి 24 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో సదస్సు జరగనుంది. ఈ రెండేళ్లలో లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగించనున్నారు. తెలంగాణలో ఈ రంగంలో అనుకూలతలు, అవకాశాలపై మాట్లాడనున్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు తీసుకొచ్చే అవకాశం ఆయనకు దక్కింది.



# అజ్ఞాతం వీడి జన జీవనంలోకి...

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టు పార్టీలో దాదాపు రెండో స్థానంలో చలామణి అవుతున్న మల్లోజుల వేణుగోపాల్ లొంగిపోవటం ఆ పార్టీ అతిపెద్ద ఎదురుదెబ్బ అని పోలీసులు భావిస్తున్నారు. వరుస ఎన్ కౌంటర్లలో కీలక నేతలు చనిపోవటంతో పాటు వరుసగా లొంగుబాటులు జరుగుతున్న నేపథ్యంలో మావోయిస్టు ఉద్యమం బలహీనపడుతోందన్న ప్రచారం తీవ్రస్థాయికి చేరుతోంది.

**అత్యంత కీలక నేతగా...**

మల్లోజుల వేణుగోపాల్ 1981లో తాను ఎంచుకున్న సిద్ధాంతం కోసం అడవి బాట పట్టారు. మొదటగా ఏటూరు నాగారం దళం సభ్యుడిగా ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1982లో మహదేవపూర్ పోలీసులు మల్లోజులను అరెస్టు చేయగా, 1983లో విడుదల కావడంతో తిరిగి దళంలోకి వెళ్లారు. 1993లో డీకేఎస్ఆర్సీ సెక్రటరీగా ఎన్నికయ్యారు. 1995లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2007లో పొలిట్ బ్యూరో మెంబర్ గా పదోన్నతి లభించింది. పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ కీలకంగా మారారు. ఇక గత కొన్నిరోజుల కిందటే మల్లోజుల మావోయిస్టు పార్టీకి రాజీనామా చేసినట్లు వార్తలు వచ్చాయి. ఆయుధాలను వదులుకుని ప్రధాన స్రవంతిలో కలవాలని, తమను తాము రక్షించుకోవాలని, అర్థరహిత త్యాగాలు చేయవద్దని కార్యకర్తలకు ఆయన ఒక లేఖలో పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాను ఇకపై సాయుధ పోరాటాన్ని కొనసాగించలేనని సోను తన సహచరులకు లేఖలో చెప్పారు.

# సస్పెన్స్ కు తెరదించిన బీజేపీ

- జూబ్లీహిల్స్ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీ
- అధికారికంగా ప్రకటించిన పార్టీ

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మూడు పార్టీలో తమ గెలుపు గుర్రాలను నిలబెడుతున్నాయి. ఎలాగైనా విజయం సాధించాలని పట్టుదలతో ఉన్నాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో తన అభ్యర్థి విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. మరోసారి లంకల దీపక్ రెడ్డికి అవకాశం ఇచ్చింది. ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ బుధవారం పార్టీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ తరుపున లంకల దీపక్ పోటీ చేస్తున్నట్లు పార్టీ వెల్లడించింది. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా లంకల దీపక్ రెడ్డి బీజేపీ తరుపున పోటీ చేశారు. కాగా ఆ ఎన్నికల్లో ఆయన మాగంటి గోపీనాథ్ చేతిలో ఓడిపోయారు. ఇప్పుడు ఉపఎన్నికకు మళ్ళీ దీపక్‌నే ఎన్నుకోవడంతో అక్కడ పోటీ రసవత్తరంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్‌కు 80,175 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికలో లంకల దీపక్ సుమారు 26 వేల ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇప్పుడు ఆ నియోజకవర్గంలో ఉపఎన్నిక అనివార్యం కావడంతో దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, మాధవీలత తదితరుల పేర్లను బీజేపీ పరిశీలించింది. చివరకు మరోసారి దీపక్‌ను ఖరారు చేసింది. ప్రస్తుతం జరుగుతున్న ఉపఎన్నికలో బీజేపీ తరుపున లంకల దీపక్, కాంగ్రెస్ తరుపున నవీన్ యాదవ్, బీఆర్ఎస్ తరుపున మాగంటి సునీత బరిలో ఉన్నారు. వీరి మధ్య హోరాహోరీ పోటీ జరగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సునీత తొలిసారి ఎన్నికలో నిల్చుంటున్నా ప్రస్తుతం బీఆర్ఎస్ సింపతీ గేమ్ ఆడుతున్నందున ఆమెకు అవకాశం అధికంగానే ఉందని, మాగంటి గోపీనాథ్‌పై అభిమానంతో ఆమె వైపు ఓటర్లు మొగ్గు చూపే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక నవీన్ యాదవ్, లంకల దీపక్‌కు నియోజకవర్గంలో మంచి గుర్తింపు ఉన్నందున వారి మధ్య పోటీ బలంగానే ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# వైరా వేర్‌హౌస్‌లో అక్రమాల దందా

## సంచలనం సృష్టించిన మహాపత్రిక కథనం

- ఐదుగంటల పాటు విచారించిన జీఎం
- మిల్లర్ల మాఫియా.. రికార్డుల్లో గోల్‌మాల్, తప్పుడు ఎంట్రీలు
- స్పందించిన కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ఖమ్మం బ్యూరో, మహా:** పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పీడీఎస్)కి చెందిన వేర్‌హౌసింగ్ గోదాములు ఇప్పుడు అక్రమాలకు, అవినీతికి అడ్డాగా మారాయనేది వైరా ఘటనతో తేటతెల్లమైంది. గత కొన్ని నెలలుగా ఉధృతంగా సాగుతున్న అవినీతి గోల, గోదాముల లోపల జరుగుతున్న కోట్ల రూపాయల ఆట , ఇప్పుడు రాష్ట్ర వేర్‌హౌసింగ్ వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన లోపాలను, మాఫియా పట్టును బహిరంగ మైదానానికి లాగింది. పేదలకు సరఫరా చేయాల్సిన బియ్యం బస్తాలు తిరిగి అక్రమంగా మిల్లర్లకు అమ్ముడవుతున్నాయనే అనుమానాలు, ఈ దందాలో ఉన్నతాధికారుల నుంచి కాంట్రాక్ట్ సిబ్బంది వరకు భాగస్వామ్యం ఉందనే ఆరోపణలపై మహాపత్రికలో బుధవారం ప్రత్యేక కథనం ప్రచురితం కాగా, రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు తీవ్రంగా స్పందించారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న చైర్మన్ రాయల నాగేశ్వరరావు తక్షణమే స్పందించి, ఎటువంటి జాప్యం లేకుండా సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ ఆదేశాలు కార్పొరేషన్‌లో కలకలం రేపాయి. ఆదేశాల మేరకు, కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలో సీనియర్ అధికారులు వెంకటేశ్వరరావు, రీజినల్ మేనేజర్ వీరమల్లు, సురేష్ తదితరులతో కూడిన ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం వైరా వేర్‌హౌస్‌కు చేరుకుంది. ఐదు గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు.

**వేర్‌హౌసింగ్'లో పొంతన లేని రికార్డులు**

దర్యాప్తు బృందం గోదాముల్లో ప్రతి అంగుళాన్ని పరిశోధించింది. వారి విచారణలో బయటపడిన వాస్తవాలు విస్మయాన్ని, ఆగ్రహాన్ని కలిగించేవిగా ఉన్నాయి. గోదాములో భౌతికంగా నిల్వ ఉన్న రైస్ బస్తాల సంఖ్యకు, రికార్డుల్లో చూపించిన సంఖ్యకు మధ్య భారీ తేడాలు స్పష్టంగా కనిపించాయి. రికార్డుల్లో కావాలనే ఎక్కువ స్టాక్‌ను చూపించడం, ట్రాన్స్‌పోర్ట్ రిజిస్టర్లలో తప్పుల తడకలు, డిస్పాచ్ అయినట్టుగా సృష్టించిన ఫేక్ ఎంట్రీలు , ఇవన్నీ ఒక పకడ్బందీగా, సజావుగా సాగుతున్న అవినీతి వ్యవస్థ వైపు వేలెత్తి చూపించాయి. అంతేకాదు, స్టాక్ రిజిస్టర్లలోని ముఖ్యమైన పేజీల మధ్య వైట్నర్ (తెల్లని రసాయనం) ఉపయోగించి పాత ఎంట్రీలను చెరిపివేసి, కొత్త లెక్కలను రాయడం, తేదీలు మార్చడం, ఒకే పేజీపై రెండు వేర్వేరు చేతిరాతలు కనిపించడం వంటివి రికార్డుల ట్యాంపరింగ్‌కు తిరుగులేని నిదర్శనాలుగా దర్యాప్తు బృందం గుర్తించింది.

**తిరిగి మిల్లర్లకే రైస్?**

ఈ మొత్తం అవకతవకల వెనుక అత్యంత గంభీరమైన కోణం పీడీఎస్ బియ్యం బస్తాలు ప్రభుత్వ గోదాముల నుంచి బయటకు వెళ్లి, తిరిగి పీడీఎస్ రైస్ మిల్లింగ్ దందాలో ఉన్న కొందరు మిల్లర్లకు అమ్ముడవుతున్నాయనే బలంగా వినిపిస్తున్న అనుమానం. గోదాము సిబ్బంది, కొంతమంది ఏఎంసీ అధికారుల అండదండలతో కోట్ల రూపాయల విలువైన ప్రజాధాన్యం అక్రమంగా చేతులు మారింది. ఈ దందా వెనుక పెద్ద 'మాఫియా' ఉందనేది ప్రజా సంఘాల నిరంతర ఆరోపణ. ఈ దర్యాప్తు నివేదిక ఇప్పుడు రాష్ట్ర పరిపాలన వ్యవస్థకు ఒక హెచ్చరిక. పేదవాడి కడుపు నింపాల్సిన బియ్యం, కొందరి జేబులను నింపే సాధనంగా మారడాన్ని నిలువరించాల్సిన సమయం ఆసన్నమైంది. వైరా స్కామ్ కేవలం ఒక చిన్న ఘటన కాదు అని చెప్పవచ్చు.

**దర్యాప్తు ఆరంభం .. స్టాక్ బుక్స్ సీజ్**

చైర్మన్ ఆదేశాలతో కదిలిన ప్రత్యేక విచారణ బృందం వైరా వేర్‌హౌస్‌కు చేరుకోగానే, స్టాక్ బుక్స్‌ను, రిజిస్టర్లను సీజ్ చేసి పరిశీలించడం మొదలుపెట్టింది. వేర్‌హౌస్ గోదాముల తాళాలు తెరిచి, బస్తాల సంఖ్యను లెక్కించడం, ప్రతి లేబుల్‌ను, రశీదును క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ తనిఖీలోనే వ్యత్యాసాలు స్పష్టంగా కనిపించాయి. ఒకే లాట్‌లోని బస్తాలను రికార్డుల్లో రెండు సార్లు నమోదు చేసినట్టుగా జీఎం ఆనంద్‌కుమార్ గుర్తించారు. స్టాక్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన సమాధానాలు పరస్పరం విరుద్ధంగా ఉండటంతో విచారణ వేడెక్కింది. అంతేకాదు, రికార్డుల్లో ఉన్న 'డిస్పాచ్' వివరాలు తనిఖీ చేయగా, సరుకు తరలింపునకు ఉపయోగించిన వాహన నంబర్లు తప్పుగా నమోదు చేయబడినట్టు, కొన్ని చోట్ల నకిలీ నంబర్లు ఉన్నట్టు తేలింది. రికార్డుల్లో చూపించినంత స్టాక్ భౌతికంగా గోదాముల్లో లేకపోవడం ఈ దందా లోతును తేటతెల్లం చేసింది. వైరా గోదాములలో నిల్వ ఉన్న రైస్ నాణ్యతపై దర్యాప్తు బృందం పెద్ద ప్రశ్నలను సంధించింది. బస్తాలపై ఉన్న మార్కింగ్‌లు, ట్యాగింగ్‌లు అవి పీడీఎస్ సరఫరాకు ఉద్దేశించినవే కావడాన్ని అధికారులు గమనించారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం తిరిగి అక్రమ మార్గంలో గోదాములకు చేరి, పాత స్టాక్‌తో కలిసి మళ్లీ పంపిణీ సర్కిల్‌లోకి తిరుగుతోందని దీని ద్వారా స్పష్టమవుతోంది. ముఖ్యంగా కొన్ని బస్తాల్లో నాణ్యత బాగా లోపించి ఉండటంపై జీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. "నాణ్యత లేని రైస్‌కి 'క్వాలిటీ సర్టిఫికేట్' జారీ చేసిన అధికారులు ఎవరు? ఈ సర్టిఫికేషన్ ప్రక్రియలో ఎక్కడ లంచాలు చేతులు మారాయి?" అనే ప్రశ్నలతో బృందం సిబ్బందిని ఉక్కిరిబిక్కిరి చేసింది. అనుమానాస్పదంగా ఉన్న రైస్ బస్తాల లాబ్ టెస్టింగ్ కోసం నమూనాలను సేకరించి, ఆ మొత్తం స్టాక్‌ను సీజ్ చేసి, సీలింగ్ చేయడం జరిగింది.

**రికార్డుల్లో తేడాలు .. దందాలో మేనేజర్ల సహకారం..**

ఈ దర్యాప్తులో అత్యంత ఆశ్చర్యకరమైన, వ్యవస్థీకృత అవినీతికి నిదర్శనంగా నిలిచిన అంశం – వేర్‌హౌస్ రికార్డుల్లో జరిగిన ట్యాంపరింగ్. స్టాక్ రిజిస్టర్లలోని అనేక పేజీల మధ్య వైట్నర్ తో పాత లెక్కలను చెరిపివేసి, కొత్త లెక్కలు రాసినట్టు స్పష్టంగా తేలింది. కొన్ని చోట్ల తేదీలను మార్చడం, కొన్ని రికార్డుల కింద ఉన్నతాధికారుల సంతకాలను డూప్లికేట్ చేయడం వంటి ఘోరాలు బయటపడ్డాయి. కొన్ని రిజిస్టర్లలో రెండు వేర్వేరు హ్యాండ్‌రైటింగ్స్ (చేతిరాతలు) ఉండటం, దానికి సంబంధించిన సిబ్బంది పక్క పేజీల్లో మార్పులు చేసినట్టు సంతకాలు పెట్టడం వంటివి గమనించారు. ఇదంతా కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే చేసింది కాదని, తరచుగా బదిలీలు అయ్యే ఏఎంసీ మేనేజర్లు, కీలక అధికారుల పూర్తి సహకారంతో, ఆర్థిక లావాదేవీలతోనే ఈ 'రికార్డుల దందా' నడిచిందని దర్యాప్తు బృందం ప్రాథమిక అంచనాకు వచ్చింది.

**.సస్పెన్షన్ షాక్**

ఐదు గంటల సుదీర్ఘ విచారణ , రికార్డుల పరిశీలన అనంతరం, జీఎం ఆనంద్‌కుమార్ వేర్‌హౌస్ సిబ్బందిని తీవ్రంగా మందలించారు. "ప్రభుత్వ ధాన్యం అంటే అది పేద ప్రజల ఆస్తి. దానిని మోసం చేయడం అంటే దేశాన్నీ, పేద ప్రజల నమ్మకాన్ని మోసం చేసినట్లే. ఇటువంటి చర్యలను కార్పొరేషన్ ఏమాత్రం ఉపేక్షించదు" అని ఆయన సీరియస్ వ్యాఖ్యానించారు. మరోవైపు, చైర్మన్ రాయల నాగేశ్వరరావు కూడా ఈ ఘటనపై సీరియస్‌గా స్పందించి, "ఈ వ్యవహారంలో బాధ్యులైన ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరిపైనా కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ అక్రమాలకు పాల్పడిన వారెవరూ తప్పించుకోలేరు" అని స్పష్టం చేశారు. ప్రాథమికంగా, ఏఎంసీ మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్, స్టాక్ రికార్డుల ఇన్‌ఛార్జ్ పైన తక్షణ సస్పెన్షన్ చర్యలు తీసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్ర ఫుడ్ & సివిల్ సప్లైస్ శాఖ కూడా ఈ ఘటనపై ప్రత్యేక నివేదికను కోరింది. జీఎం ఆనంద్‌కుమార్ సమర్పించే సమగ్ర రిపోర్ట్ ఆధారంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర వేర్‌హౌస్‌ల పనితీరుపై కూడా తనిఖీలు నిర్వహించి, రాష్ట్రస్థాయి విచారణ ప్రారంభమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ANN తెలుగు
మహా పత్రిక
03
గురువారం, హైదరాబాద్ | 16-10-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM



## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో ఏదుల గౌరమ్మ,కృష్ణమూర్తి ,రాజా నగరం గ్రామంలో సంపత్ సత్య వతి, భద్రం రాజు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బుధవారం నాడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ,యాట పొట్టేలు, పట్టు బట్టలను లబ్ధిదారులకు బహుమతిగా అందజేశారు... ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దు

**బీర్ల అయిలయ్య**

**ఆలేరు, మహా:** రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విజ్ఞప్తి చేశారు బుధవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు, మందనపల్లి గ్రామాల్లో ధాన్యంకొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు 70 శాతం మహిళ సంఘాలకే ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు రైతులు ఐకేపి ,PACS సెంటర్లలో ధాన్యం విక్రయించి పండించిన పంటకు సరైన ధర పొందాలని ఎమ్మెల్యే కోరారు... ఈ కార్యక్రమాల్లో భువనగిరి RDO కృష్ణా రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి ,ఆలేరు PACS మాజీ చైర్మన్ మొగులగాని మల్లేష్‌గౌడ్,అధికారుల తో పాటు మార్కెట్ డైరెక్టర్లు,కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## బీసీల రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేను రద్దు చేయాలి

**వరికుప్పల మల్లేశం**



**వలిగొండ, మహా :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేను రద్దు చేయాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు వరికుప్పల మల్లేశం అన్నారు బుధవారం మహా న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై బిజెపి కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలన్నారు హైకోర్టుకు వెళ్లిన మాధవరెడ్డి బీసీ వ్యతిరేకి అని ఆయన అన్నారు ఈ.బీ.సీ తెచ్చినప్పుడు బీసీలు ఏమైనా అడ్డుపడ్డారా అని ఆయన మండిపడ్డారు మారిజర్వేషన్లపై మీకు ఎందుకంత కడుపు మంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు అన్నదమ్ముల వలె ఉన్నటువంటి రెడ్డి బీసీల మధ్యల తగాధ సృష్టించిన మాధవరెడ్డి ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలన్నారు జనాభా ప్రకారం రిజర్వేషన్ ఉండాలంటే మీకెందుకు కడుపు మంట అని ఆయన అన్నారు



## వలిగొండలో సిపిఐ రాస్తారోకో

**వలిగొండ, మహా :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ను హైకోర్టు స్టే ఇవ్వడం రద్దు చేయాలని వలిగొండ మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తా రోకోచేసి నిరసన తెలిపారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి ఎలగందుల అంజయ్య మహేష్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

## ప్రధాని మోదీ నేడు శ్రీశైలం క్షేత్రానికి

**తొలిసారి మల్లిఖార్జునుడి దర్శనానికి**

**రూ.13,430 కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టులు**

**కర్నూలు, మహా :** భారత ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లా లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ పర్యటనలో శ్రీశైలం పవిత్ర పుణ్యక్షేత్రంలో స్వామివారిని దర్శించుకుని, అనంతరం ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ. 13,430 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రధానితో పాటుగా, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో సహా మంత్రులు కూడా ఈ పర్యటనలో పాల్గొంటారు. ప్రధాని హోదాలో తొలిసారి శ్రీశైలం వస్తున్న నేపథ్యంలో, ఆలయ అధికారులు, స్థానిక యంత్రాంగం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు.

# అభివృద్ధి పాలన వర్సెస్ అరాచక పాలనకు జరుగుతున్న పోటీ

**సునిత నామినేషన్ సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**హైదరాబాద్, మహా :** గులాబీ పార్టీ జైత్రయాత్ర మరోసారి జూబ్లీహిల్స్ నుంచి ప్రారంభం కాబోతున్నదని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తమ అభ్యర్థి మాగంటి సునీతకు అన్ని వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతున్నదని, అన్ని వర్గాల మద్దతు, అండతో తమ పార్టీ అభ్యర్థి సునీత ఘన విజయం సాధించబోతున్నదన్నారు. రెండేళ్ళ విఫల కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రతి ఒక్కరూ మాగంటి సునీతకు మద్దతు ఇవ్వాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీల మధ్యలో జరుగుతున్న ఎన్నిక కాదని.. ఈ ఉప ఎన్నిక ఇద్దరు వ్యక్తుల ఎన్నిక కాదన్నారు. ఈ ఎన్నిక పదేండ్ల అభివృద్ధి పాలనకి.. రెండేళ్ళ అరాచక పాలనకి మధ్య జరుగుతున్న ఉపఎన్నిక అని పేర్కొన్నారు. పదేండ్ల రైతుబంధు పాలనకు, రెండు సంవత్సరాల రాక్షస పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నిక అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నామినేషన్‌కు వెళ్ళేముందు కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారని చెప్పుకొచ్చారు. సునిత గెలుపుతోనైనా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.2500 ఇస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. లక్షల మంది రైతన్నలు సునీత గెలుస్తుందని ఆశిస్తున్నారని అభిప్రాయపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, తర్వాత మోసపోయిన యువతి యువకులు ఎన్నికలో కాంగ్రెస్ ను ఓడించేందుకు చూస్తున్నారని విమర్శించారు. తమ ఇళ్లు కూలగొట్టిన అరాచకాలను చూసిన తర్వాత, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవాలని, ఆ అరాచకాలు ఆగాలని హైదరాబాద్ నగర పేదలు చూస్తున్నారని అన్నారు. మూతపడుతున్న బస్తీ దవాఖానాలు, ఉచిత తాగునీరు ఆగిపోతున్న విషయాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక ఇల్లు కూడా హైదరాబాదులో కట్టలేదని దుయ్యబట్టారు. కేసీఆర్ హైదరాబాద్‌లో నిర్మించిన లక్ష ఇళ్లు, ఇచ్చిన ఇళ్ల పట్టాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా హైదరాబాద్ నగర ప్రజలకు గుర్తున్నాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన మైనార్టీలకు ఈ ఎన్నిక ఒక అవకాశంగా భావిస్తున్నారని అభిప్రాయపడ్డారు. తమకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, రిజర్వేషన్లు అన్నీ మోసమని, ఈ అంశంలో గుణపాఠం చెప్పడానికి రాష్ట్రవ్యాప్తంగా బీసీలు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు.దళిత బంధు, అభయహస్తం అని చెప్పి మోసం చేసిన దళితులు కూడా ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. కేసీఆర్ ఆధ్వర్యంలో మరోసారి పాలన రావడానికి, హైదరాబాద్ నగరంలో జరుగుతున్న ఈ ఉప ఎన్నిక పునాది కాబోతుందని వ్యాఖ్యానించారు.

# బీసీ వ్యతిరేకి బీజేపీ

**ఇది కిషన్‌రెడ్డి రాజ్యం.. ఎమ్మెల్యే రాజాసింగ్ ఫైర్**

**హైదరాబాద్, మహా :** కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బీసీలకు చోటు లేదు.. ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం కిషన్ రెడ్డి రాజ్యం కిషన్ రెడ్డి రాజ్యం అంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ నినాదం చేశారు. తెలంగాణలో ఎన్నికలు జరిగినప్పుడల్లా.. ప్రముఖ నాయకుడు వచ్చినప్పుడల్లా.. భవిష్యత్తులో ఒక బీసీ తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతాడని అందరూ అంటారన్నారు. కానీ రాష్ట్రంలో ఉప ఎన్నికలు కానీ వస్తే బీసీలనే మర్చిపోతారని ఫైర్ అయ్యారు. బీసీలు తెలంగాణ బీజేపీలో ఎక్కడున్నారో చెప్తారా అని కిషన్ రెడ్డిని ప్రశ్నించారు. గతంలో తానెప్పుడూ ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు లేదా ఓబీసీల గురించి మాట్లాడలేదని.. హిందూత్వం గురించి మాత్రమే మాట్లాడానని గుర్తు చేశారు. కానీ మొదటిసారి ఇలా మాట్లాడటానికి కారణం ఉందని స్పష్టం చేశారు. ప్రతి ఎన్నికల్లో బీసీ కార్డును ప్లే చేసి బీసీ సమాజాన్ని మోసం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీని సర్వనాశనం చేసేందుకు దీపక్ రెడ్డికి అభినందనలు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి టార్గెట్ గా తీవ్ర వ్యాఖ్యలు చేసిన రాజాసింగ్ లంకల దీపక్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. దీపక్ రెడ్డి విజయం సాధించాలని రాజాసింగ్ ఆకాంక్షించారు.

## ఈ నెల 18న బీసీ బంద్ ను జయప్రదం చేయండి

**బిసి జాక్**



**భువనగిరి, మహా:** బీసీ రిజర్వేషన్లు సాధన కోసం బీసిలందరు ఈనెల 18న జరపతలపెట్టిన బీసీ బంద్ ను జయప్రదం చేయాలని బీసీ సంఘాల సమన్వయ సంఘం జాక్ పిలుపు నిచ్చింది యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం నాడు వివిధ రాజకీయ పార్టీల, బిసి నేతలు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, బీసీ కులాల నేతలు సమన్వయ కర్తలు మెరుగు మధు, మాటూరి అశోక్ ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో 18 జరగనున్న తెలంగాణ బిసి బంద్ ను యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని వక్తలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. జిల్లాలోని వ్యాపార సంఘాలు, విద్యాసంస్థల యాజమాన్యాలు బందుకు సహకరించాలని కోరారు.. కార్యక్రమంలో తమ తమ పార్టీల నుండి పూర్తి సహకారం అందిస్తామని బందులో పాల్గొంటామని బిజెపి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, BRS, TPS పార్టీలను నాయకులు అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిలు పెంట నరసింహ, అతికం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, బిజెపి జిల్లా నాయకులు సుర్వి శ్రీనివాస్ గౌడ్, దేవరకొండ నరసింహాచారి, పిట్టల బాలరాజు, టిఆర్ఎస్ నాయకులు బీరు మల్లయ్య, ఏనబోయిన ఆంజనేయులు, సిపిఐ నాయకులు ఏశాల అశోక్, సిపిఎం మాయ కృష్ణ, ప్రైవేట్ డిగ్రీ కళాశాల నాయకులు చిక్కా ప్రభాకర్, దరిపల్లి ప్రవీణ్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్క వెంకటేశ్వర్లు, మేర సంఘం కీర్తి సత్యనారాయణ, పట్టు సంఘం కుమార్ విక్రమ్, కుమ్మర సంఘం గోపాల్, ముదిరాజ్ సంఘం సాధు విజయకుమార్, వంజరి సంగం కలియా నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి, బీసీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బాబురావు గొట్టిపాముల, యాదవ సంఘం కనక బాలకృష్ణ, రజక సంఘం సిరికొండ శివ, ఎంబీసీ జిల్లా అధ్యక్షులు కొత్త బాలరాజు, బీసీ సంఘం నాయకులు సాయిని యాదగిరి, పేరపు రాములు, ఎరుకల వెంకటేష్ గౌడ్, అశోకా చారి, అమృతం సత్యనారాయణ, మాటూరు బాలేశ్వర్, రామ్మూర్తి, రేఖల ఆనందం, మాటూరు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# కవిత పోస్టర్ నుండి కేసీఆర్ మాయం

**బీఆర్‌ఎస్ అధినేతగా కాకపోయినా తండ్రిగా కేసీఆర్ ఫొటోను పెట్టుకునే అవకాశముంది**

**కేసీఆర్ ఫొటో లేకపోవడాన్ని సమర్థించుకున్న కవిత**


**ఈ నెల 25 వ తేదీ నుంచి ఫిబ్రవరి 13 వరకు యాత్ర.. 33 జిల్లాలు, 112 రోజులు**

**హైదరాబాద్, మహా :** బీఆర్‌ఎస్ ఎంఎల్సీ కల్వకుంట్ల కవితకు సంబంధించి బుధవారం ఇంట్రెస్టింగ్ డెవలప్ మెంట్ జరిగింది. అదేమిటంటే తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత తన యాత్ర పోస్టర్ రిలీజ్ చేశారు. అక్టోబర్ 25, 2025 నుండి ఫిబ్రవరి 13,2026 వరకు తెలంగాణలో యాత్ర చేయబోతున్నారు. అన్నీవైపుల నుండి కవితపై బీఆర్‌ఎస్ బాణాలు ఎక్కుపెడుతున్న నేపథ్యంలో వాటిని తట్టుకుని నిలబడాల్సిన అవసరం ఉందని కవిత భావిస్తున్నారు. కవితపైన కాంగ్రెస్, బీజేపీ కన్నా బీఆర్‌ఎస్సే ఎక్కువ ఆరోపణలు చేస్తోంది. తనను తాను ప్రూవ్ చేసుకుని జనాల్లో నిలబడేందుకు కవిత గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే సుమారు 112 రోజుల యాత్రను కవిత ప్రారంభించబోతున్నారు. మధ్యలో అక్కడక్కడ గ్యాప్ వచ్చినా మొత్తం 33 జిల్లాల్లోను యాత్రలు చేయటానికి కవిత రెడీ అవుతున్నారు.

ఈ నేపథ్యంలో బుధవారం విడుదల చేసిన పోస్టర్ లో కేసీఆర్ ఫొటో ఎక్కడా కనబడలేదు. ఎల్లో కలర్ పోస్టర్ లో ఎడమ వైపు కార్నర్ లో పైన జై తెలంగాణ, కుడిపైపు కార్నర్ లో చివర జై జాగృతి అని నీలిరంగు అక్షరాలున్నాయి. రెండు అక్షరాలకు మధ్యలో తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయ్ శంకర్ బొమ్మలు చిన్నవిగా కనబడుతున్నాయి. మధ్యలో కవిత పెద్ద ఫొటోలో కనబడుతున్నారు. ఫొటోలో ఆకుపచ్చ రంగులో 'జాగృతి జనం బాట' అని తెల్లటి అక్షరాలున్నాయి. దానికింద నీలిరంగులో 'మేధావులతో సమాలోచనప్రజలతో మమేకం' అని రాసుంది. దాని కింద నీలం రంగు స్ట్రిప్ లో యాత్ర మొదలయ్యే, ముగిసే తేదీలున్నాయి. దానికింద ఎర్రటి అక్షరాల్లో తెలంగాణ జాగృతి అనుంది. తెలంగాణజాగృతి అనే ఎర్రటి అక్షరాల మధ్యలో ఆకుపచ్చ రంగులో తెలంగాణ మ్యాప్ దాని మధ్యలో దీపం కనబడుతోంది.




కవితకు సంబంధించిన తెలంగాణ జాగృతి పోస్టర్ మొత్తం మీద తన తండ్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బొమ్మ ఎక్కడా కనబడలేదు. బీఆర్‌ఎస్ తనను సస్పెండ్ చేసింది కాబట్టి అధినేత కేసీఆర్ ఫొటో ఉపయోగించలేదని సమర్థించుకున్నారు. అయితే కవిత వాదనలో డొల్లతనం కనబడుతోంది. ఎలాగంటే బీఆర్‌ఎస్ అధినేతగా కాకపోయినా తండ్రిగా కేసీఆర్ ఫొటోను పెట్టుకునే అవకాశముంది. ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోను వేసినపుడు తండ్రి కేసీఆర్ ఫొటోను వాడుకోవటంలో తప్పులేదు, వేస్తే అడిగే వాళ్ళు కూడా లేరు. అయినా కేసీఆర్ ఫొటోను పోస్టర్లో కవిత ఉపయోగించాలని అనుకోలేదు. ఎందుకంటే తండ్రి మీద కూడా కవితకు బాగా కోపం ఉంది. దగ్గరి బంధువులు తన్నీరు హరీష్‌రావు, జోగినపల్లి సంతోష్ రావు లాంటి వాళ్ళ చెప్పుడుమాటలు విని, వాళ్ళచేతుల్లో కేసీఆర్ బంధీగా మారిపోయారని కవితకు బాగా కోపంగా ఉంది. చెప్పుడు మాటలు వినే తనను చివరకు పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు కేసీఆర్ పై ఆగ్రహంతో ఉన్నారు. చెప్పుడు మాటలు విని సొంతబిడ్డ అయిన తనను కూడా కేసీఆర్ దూరంగా పెట్టారని కవిత గతంలో చాలా ఆగ్రహం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. సొంతబిడ్డనే పరాయిదాన్ని అయిపోయానని కవిత మీడియా ముందే కన్నీళ్ళు పెట్టుకున్న సందర్భాలున్నాయి. తండ్రికూతురు వ్యవహారం ఎంతదాకా వెళ్ళింది అంటే కవితను ఫామ్ హౌసులోకి అడుగుకూడా పెట్టనీయనిలేదు. పదిమందితో కలిసి కవిత ఫామ్ హౌస్ కు వస్తే కేసీఆర్ కనీసం చూడటానికి కూడా ఇష్టపడలేదు. చిన్నకొడుకు అమెరికాకు వెళుతున్నపుడు ఆశీస్సులు కావాలని ఫామ్ హౌస్ కు వచ్చిన కవితను తండ్రి బెడ్ రూమ్ బయటే ఆగిపోవాల్సి వచ్చింది. కేవలం మనవడిని మాత్రమే గదిలోకి పిలిపించుకున్న విషయం స్వయంగా కవితే చెప్పారు. పార్టీలో తనకు చోటులేదని తేలిపోయిన తర్వాతే కాళేశ్వరం అవినీతి, అక్రమాల్లో హరీష్, సంతోష్ తదితరుల పాత్ర ఉందని మీడియా సమావేశంలో కవిత చెప్పారు. దాని ఫలితంగానే పార్టీనుండి కవిత సస్పెన్షన్. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే కేసీఆర్ మాత్రం మంచోడు మిగిలిన వాళ్ళంతా చెడ్డోళ్ళని కవిత పదేపదే చెబుతుండటం. ఎవరు మంచోళ్ళు, ఎవరు చెడ్డోళ్ళో తెలుసుకోలేని స్థితిలో కేసీఆర్ దశాబ్దాలుగా రాజకీయాలు చేస్తున్నారా ? కుటుంబంలో కేటీఆర్ తో ఎప్పుడో, ఎక్కడో కవితకు చెడింది. దాంతో కవితకేటీఆర్ అని తేల్చుకోవాల్సిన పరిస్థితుల్లో సహజంగానే కేసీఆర్ కొడుకు కేటీఆర్ వైపు మొగ్గుచూపించి కూతురును దూరం పెట్టేశారు. దాన్ని తట్టుకోలేకే సమానత్వం కోసం పోరుబాటబట్టి చివరకు పార్టీనుండి సస్పెండ్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే కవిత తాజాగా ఆవిష్కరించిన జాగృతి జనంబాట పోస్టర్ లో కేసీఆర్ ఫొటో మాయమైపోయింది.



## ఢిల్లీలో టపాసులు పేల్చుకోవచ్చు!

- **దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీంకోర్టు ఓకే**
- **ఈ నెల 18 నుంచి 21 వరకు మాత్రమే అవకాశం**

**ఢిల్లీ, మహా:** ఢిల్లీ పర్యావరణహితమైన బాణసంచా (గ్రీన్ క్రాకర్స్) విక్రయాలు, వినియోగానికి సుప్రీంకోర్టు అనుమతించింది. దీపావళి కోసం పిల్లలు ఎదురుచూస్తారని.. గ్రీన్ క్రాకర్స్‌తో వారిని పండగ చేసుకోవడానికి అనుమతించాలని సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం అత్యున్నత న్యాయస్థానం ఈ అనుమతి ఇచ్చింది. 'స్మగ్లింగ్ చేసిన బాణసంచాను వాడటం వల్ల గ్రీన్ క్రాకర్స్ వినియోగించిన దానికంటే ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. అందుకే ఈ పరిస్థితులను బ్యాలెన్స్ చేసేలా చర్యలు ఉండాలి. పర్యావరణానికి హాని కలగకుండా మితంగా వాడేందుకు అనుమతిస్తున్నాం'' అని సుప్రీంకోర్టు పేర్కొంది.

### అక్టోబర్ 18 నుంచి 21 మధ్యనే..

ఇది తాత్కాలిక చర్య అని, అక్టోబర్ 18 నుంచి 21 మధ్యనే వాటిని కాల్చాలని తేల్చిచెప్పింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లోకి బయటి నుంచి ఎలాంటి పటాకులు తీసుకువచ్చేందుకు అనుమతి లేదని స్పష్టం చేసింది. ఈ సమయంలో కాలుష్య నియంత్రణ సంస్థలు గాలి నాణ్యతా సూచీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది. ఢిల్లీలోని ఎన్సీఆర్ పరిధిలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలోనే ఉన్నందున బాణసంచా విక్రయాలను నిషేధిస్తూ సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చింది. దీనిపై పిటిషన్లు దాఖలయ్యాయి.

## తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం

**హిందీ సినిమాలు.. హోర్డింగ్ లు బ్యాన్**

**చెన్నై, మహా :** తమిళనాడులో హిందీ భాషా వివాదం మరో కీలక మలుపు తిరిగింది. అక్కడి స్టాలిన్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. హిందీ మూవీస్ బ్యాన్ కు స్టాలిన్ సర్కార్ బిల్లు ప్రవేశపెట్టనున్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా హిందీ భాషా హోర్డింగ్‌లు, హిందీ సినిమాలు, హిందీ పాటలపై నిషేధం విధించే ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తూ, తమిళ భాష, సంస్కృతిని పరిరక్షించుకోవడంలో భాగంగానే డీఎంకే ప్రభుత్వం ఈ చట్టపరమైన చర్యకు సిద్ధమవుతున్నట్లుగా అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ బిల్లు రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే ఉంటుందని, రాజ్యాంగంలోని అధికరణ 343351 ప్రకారం ఇంగ్లీషును సహఅధికారిక భాషగా కొనసాగించే విధానానికి కట్టుబడి ఉంటామని ప్రభుత్వ అధికారులు స్పష్టం చేస్తున్నారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల చివరి రోజున సీఎం స్టాలిన్ ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాలలో, ముఖ్యంగా అధికార డీఎంకే, ప్రతిపక్ష బీజేపీ మధ్య మరో తీవ్ర వివాదానికి దారితీసే అవకాశం ఉంది.

## బీజేపీ ఆఫీసులో డిష్యుం... డిష్యుం...

**పరస్పరం కొట్టుకున్న బీసీ నేతలు.. మీడియా ముందే దాడులు**

**రాష్ట్ర బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కోరిన కృష్ణయ్య.**

**హైదరాబాద్, మహా :** బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీసీ నేతలు పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో అక్కడ ఒక్క సారిగా వాతావరణం హీటెక్కింది. బీసీ సంఘాల నేతలు, బీజేపీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఒకరిపై ఒకరు పిడిగుద్దులు విసురుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బీసీ రిజర్వేషన్లను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 18న రాష్ట్ర బంద్‌కు బీసీ జేఏసీ ఛైర్మన్ ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆ బంద్‌కు మద్దతు ఇవ్వాలని బీజేపీని కోరారు. ఈ మేరకు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావును కలిసి మద్దతు కోరేందుకు ఆర్ కృష్ణయ్య కార్యాలయానికి వచ్చారు. బీసీ నేతలు, బీజేపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని నేతలను కోరారు. ఆ తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫొటోల కోసం ఈ రెండు వర్గాల నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్తా ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఒకవైపు నుంచి రామచందర్ రావు, ఆర్ కృష్ణయ్య వారిస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. తమ గొడవలో నిమగ్రమైపోయి ఉన్నారు. దీంతో మిగిలిన నేతలు వెంటనే కలుగజేసుకుని గొడవను సర్దుమణిగించారు. కేవలం మీడియా ముందు కనిపించేందుకే నేతలు దాడులు చేసుకోవడం గమనార్హం. జీవో ఎంఎస్ 9 అమలుపై స్టే కు నిరసనగా రాష్ట్రంలోని బీసీ సంఘాలు ఈనెల 18వ తేదీన బంద్ పాటించాలని డిసైడ్ అయ్యాయి. అయితే ఇదే విషయమై ఆదివారం సమావేశమైన 33 బీసీ సంఘాలు సుదీర్ఘంగా చర్చించాయి. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జేఏసీగా ఏర్పడ్డ బీసీ సంఘాలన్నీ కలిసి ఛైర్మన్ గా బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ ఆర్ కృష్ణయ్యను ఛైర్మన్ గా సమావేశం నియమించింది. వైస్ ఛైర్మన్ గా వీజీఆర్ నారగోని, వర్కింగ్ ఛైర్మన్ గా జాజుల శ్రీనివాస గౌడ్, కో ఛైర్మన్ గా దాసు సురేష్, రాజారామ్ యాదవ్ ను సమావేశం నియమించింది. ఈ జేఏసీ ఆధ్వర్యంలోనే బంద్ ను విజయ వంతం చేసేందుకు బీసీ నేతలు పార్టీల నేతలను కలిసి మద్దతును కూడగదుతున్నాయి. అందులో భాగంగానే బీజేపీ నేతలను కలిసి మద్దతు కోరారు.

# తెలుగింటి తొలి గాయని బాలసరస్వతి కన్నుమూత

**వివిధ భాషల్లో 2వేలకు పైగా పాటలు పాడిన తెలుగింటి కోయిల**

**హైదరాబాద్, మహా :** తెలుగులో తొలి నేపథ్య గాయని రావు బాలస్వతి (97) బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్తను కుటుంబ సభ్యులు ధ్రువీకరించారు. హైదరాబాద్‌లోని నివాసంలో ఆమె తనువు చాలించారని వారు చెప్పారు. ఆమె మరణంపై సినీ నటులు, ప్రముఖులు సంతాపం తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా తన ప్రగాఢ సంతాపం తెలిపారు. బాలసరస్వతి మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. "దక్షిణాదిలో తొలి నేపథ్య గాయనిగా, తెలుగు సినిమా రంగానికి లలిత సంగీతాన్ని పరిచయం చేసిన బాలసరస్వతి దేవి మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా" అని రేవంత్ పేర్కొన్నారు.

**అసలెవరీ బాలసరస్వతి..**

29 ఆగస్టు 1928న మద్రాసులో పార్థసారథి, విశాలక్షి దంపతులకు బాల సరస్వతి జన్మించారు. ఆమె పెద్దగా చదువుకోలేదు. వీరికి గుంటూరులో రత్న మహల్ అని సినిమా థియేటర్ ఉండేది. దాంతో ఆమె తాతయ్య మినహా మిగిలిన వారంతా మద్రాసు నుంచి గుంటూరుకు వచ్చేశారు. గుంటూరులోనే ఆమె అలత్తూర్ సుబ్బయ్య దగ్గర శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసించారు. ఆమె అభ్యాసం మూడు సంవత్సరాలు సాగింది. ఆ తర్వాత ఖేల్కర్, వసంత దేశాయ్ దగ్గర హిందుస్తానీ సంగీతం, కే పిచ్చుమణి దగ్గర వీణ, డానియల్ దగ్గర పియానో వాయిద్యాలను కూడా నేర్చుకున్నారు. ఆమె పాటలు పాడటం ఆరవయేట నుంచే ప్రారంభించారు. ఆరేళ్ల వయసులోనే హెచ్ఎంవీ కంపెనీ ద్వారా "నమస్తే నా ప్రాణనాథ, ఆకలి సహింపగజాల, పరమపురుష పరంధామ'' వంటి మరెన్నో పాటలను ఆలపించారు. ఆ తర్వాత సీ పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన 'సతీఅనసూయ' అనే చిన్న పిల్లల సినిమాలో ఆమె గంగ పాత్రను పోషించారు. అదే సినిమాలో ఒక పాట పాడి సినీ రంగానికి పరిచయమయ్యారు. ఆ తర్వాత 1944లో ఆమె కోలంక జమీందారీకి చెందిన రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు బహద్దూర్‌ను వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత నటనకు దూరంగా ఉన్నారు. ప్లేబ్యాక్ సింగర్‌గానే కెరీర్‌ను కొనసాగించారు. ఆమె తెలుగు, తమిళం, హిందీ, కన్నడ సహా పలు భాషల్లో మొత్తం 2 వేల వరకు పాటలు పాడారు. ఆమెను మహా గాయనిగా చూడాలన్నది ఆమె తండ్రి కల. అందుకే చిన్న వయసు నుంచే ఆమెకు పట్టు బట్టి సంగీతం నేర్పించారు. అనుకున్నట్లుగా ఆమె అద్భుత నేపథ్యగాయినిగా నిలిచారు.

**రేడియో ద్వారా పరిచయం**

బాలసరస్వతి సినీ రంగ ప్రవేశానికి ముందే రేడియో ద్వారా తెలుగు వారికి పరిచయయ్యారు. 1944లో మద్రాసు ఆకాశవాణి రేడియో కేంద్రంలో, 1948లో విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో ఈమె పనిచేశారు. ఆ రేడియోలో వచ్చే సంగీత కార్యక్రమంతో ఆమె కెరీర్‌ను స్టార్ట్ చేశారు. ప్రసిద్ధ సంగీత దర్శకులు ఎస్. రాజేశ్వరరావుగారితో కలిసి 194050 మధ్య కాలంలో ఎన్నో లలిత గీతాలు ఆలపించింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, ఆరుద్ర, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బాలాంత్రపు రజనీకాంతరావులు రచించిన ఎన్నో గేయాలు రేడియోలో పాడారు.



EDITORIAL సంపాదకీయం


# జూబ్లీహిల్స్.. ట్రయాంగిల్ ఫైట్

## మూడు పార్టీల బలాలు.. బలహీనతలు

(మొదటిపేజీ తరువాయి)

ఇదే ట్రెండ్ లో ఇపుడు జూబ్లిహిల్స్ హైటెన్షన్ క్రియేట్ చేస్తోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ తో ఈ టర్మ్ బైపోల్ లో కాంగ్రెస్ పార్టీ బోణీ కొట్టింది. ఇపుడు జూబ్లీహిల్స్ లో కొట్టి సర్కారుకు తిరుగులేదని చాటాలనుకుంటోంది. ఒక్క అధికారపార్టీకే కాదు.. అన్ని ప్రధాన రాజకీయపార్టీలకు ఈ ఎన్నిక పెద్ద సవాలే. ఎన్నిక అన్నాక ఎవరి స్కెచ్ వారికి ఉంటుంది. అధికారపార్టీ గెలిస్తే.. ఈ టర్మ్ కు సాఫీగా సాగిపోతుంది. స్థానిక ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీలోనూ అడ్వాంటేజ్ అవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వానికి ఎదురుండదు. తేడావస్తే.. మాట్లాడుదామని ఎదురుచూస్తున్న నోళ్ళు ఇది టైం కాదని సైలెంట్ అయిపోతాయి. బీఆర్ఎస్ పార్టీకి అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలు వరుస షాకులిచ్చాయి. ఇపుడు గెలవకుంటే క్యాడర్ లో ధైర్యం నింపడం కష్టమవుతుంది. కొంతకాలం క్యాడర్ నిరాశలోకి వెళ్ళిపోతారు. బీజేపీ 8 పార్లమెంట్ స్థానాలు గెలిచి.. మేమే ప్రత్యామ్నాయం అంటూ కాలర్ ఎగరేస్తుండగా, బీజేపీ ఎంపీ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గం కావడంతో పరువు ప్రతిష్టలతో ముడిపడి ఉంది. ఇక్కడ గెలవాలి. లేదంటే.. గెలిచేలా పోటీనివ్వాలి. లేకపోతే బీజేపీపై రాష్ట్రవ్యాప్త ఎఫెక్ట్ పడుతుంది.

ఇక జూబ్లీహిల్స్ కు సంబంధించి.. మూడు ప్రధాన పార్టీల బలాలు.. బలహీనతలు




### మాగంటి సునీత (బీఆర్ఎస్)

**బలాలు:**

1. భర్త మాగంటి గోపినాథ్ మృతితో సానుభూతి సెంటిమెంట్
2. గెలుపు కోసం కేటీఆర్, హరీష్ రావు తో పాటు సిటీలో ఉన్న కీలక నేతలంతా మోహరించడం
3. టీడీపీ క్యాండిడేట్ లేకపోవడంతో ఆ పార్టీ ట్రెడిషనల్, సెటిలర్ ఓటు బ్యాంకు కలిసివచ్చే ఛాన్స్
4. గతంలో భర్త గోపినాథ్ ద్వారా వివిధ పథకాలు పొందిన వారు, లబ్ధి పొందిన వారు అండగా నిలిచే అవకాశం

5.అధికార కాంగ్రెస్ పార్టీపై కొన్ని వర్గాల్లో వ్యతిరేకత, హైడ్రాపై భయం

6 ముందుగా అభ్యర్థిని ఖరారుచేయడం

**బలహీనతలు:**

1. రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ తదితరులు కార్పొరేటర్లు పార్టీని వీడడం
2. మాగంటి కుటుంబంలో విభేదాలు ఉన్నాయన్న వార్తలు
3. గోపీనాథ్ సోదరుడు వజ్రానాథ్ సహకరించకపోవడం
4. కాంగ్రెస్ పార్టీ బీసీ అభ్యర్థిని బరిలోకి దించడం
5. ఈ సారి ఎంఐఎం పార్టీ కాంగ్రెస్ కు మద్దతు ఇస్తుందన్న ప్రచారం
6. బీఆర్ఎస్ కీలక నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ అల్లుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేయడంతో ఆయన సపోర్ట్ పై అనుమానాలు

### నవీన్ యాదవ్(కాంగ్రెస్)..

**బలాలు:**

1. బలమైన యాదవ సామాజిక వర్గానికి చెందిన బీసీ అభ్యర్థి కావడం..
2. రాష్ట్రంలో ప్రస్తుతం బీసీల చుట్టూ పాలిటిక్స్ సాగుతుండడం
3. గతంలో రెండు సార్లు ఓడిపోయాడన్న సెంటిమెంట్.. సేవా కార్యక్రమాలు
4. తండ్రి చినశ్రీశైలం యాదవ్ కు నియోజకవర్గంతో 40 ఏళ్లకు పైగా ఉన్న అనుబంధం

5. షెడ్యూల్ కు ముందునుండే నియోజకవర్గంలో మంత్రుల పర్యటనలు, భారీగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన

6 గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేయడం.. ఆ వర్గాల నుంచి మంచి సపోర్ట్ ఉండడం

7. అధికారపార్టీ కావండ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ చేయడం

**బలహీనతలు:**

1. తండ్రిపై రౌడీ షీటర్ నమోదు కావడం.. ప్రతిపక్షాలు ఆ విషయాన్ని అస్త్రంగా చేసుకోవడం..
2. సోదరుడిపై కూడా ఇదే రకమైన ఆరోపణలు రావడం..
3. టికెట్ ఆశించి భంగపడ్డ అంజన్ కుమార్ యాదవ్, సీఎన్ రెడ్డి సపోర్ట్ పై అనుమానాలు
4. బీఆర్ఎస్ కు ధీటుగా సోషల్ మీడియాను ఉపయోగించుకోలేకపోవడం
5. ప్రచారంలో ఒక వేవ్ ను ఇంకా తీసుకురాలేకపోవడం

### దీపక్ రెడ్డి (బీజేపీ)

**బలాలు:**

1. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోవడం..
2. 2023 ఎన్నికల్లో పోటీ చేసిన అజారుద్దీన్, మాగంటి గోపినాథ్ ఇద్దరూ ఇప్పుడు బరిలో లేకపోవడం..
3. దీపక్ రెడ్డి మినహా బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ కొత్త వారే కావడం
4. టీడీపీతో రాజకీయ ప్రవేశం చేయడంతో ఆ పార్టీ శ్రేణులు సపోర్ట్ చేసే ఛాన్స్
5. అర్బన్ నియోజకవర్గం కావడం, ఎక్కువ మంది చదువుకున్న ఓటర్లు ఉండడంతో బీజేపీకి కలిసి వస్తుందన్న నమ్మకం

6. నూతన బీజేపీ చీఫ్ రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం

**బలహీనతలు:**

1. టికెట్ ఆలస్యంగా ప్రకటించడం
2. షెడ్యూల్ వచ్చిన తర్వాత రఘునందన్ రావు మినహా మిగతా అగ్రనేతలెవరూ నియోజకవర్గంలో పెద్దగా పర్యటించకపోవడం
3. బీజేపీలో వర్గవిభేదాలు..
4. ఆ పార్టీ ఈ ఎన్నికను సీరియస్ గా తీసుకోవడం లేదన్న ప్రచారం బలంగా ఉండడం..
5. గతంలో దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు మాదిరిగా ఇక్కడ ఫోకస్ పెట్టకపోవడం
6. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ ను గెలిపించేందుకు బీజేపీ పని చేస్తోందన్న ప్రచారాన్ని తిప్పికొట్టడం లో ఫెయిల్ కావడం

### జూబ్లీహిల్స్ నియోజకవర్గ ముఖచిత్రం

మొత్తం ఓటర్లు: **3,98,982**

బీసీలు: **1.60లక్షలు**

ముస్లింలు: **1.10లక్షలు**

ఎస్సీలు: **26,000**

కమ్మ: **17,000**

రెడ్డి: **18,000**

యాదవులు: **15,000**

క్రిస్టియన్లు: **10,000**

పురుషులు: **2,07,367**

మహిళలు: **1,91,590**

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:

mahaapatrika@gmail.com

whatsapp: 74369 39999

# మల్లోజుల వేణుగోపాల్ ప్రస్థానం

మావోయిస్టు పార్టీ అగ్రనేత, ఒక దశలో మావోయిస్టు ఉద్యమానికి సారథ్యం వహించిన మల్లోజుల వేణుగోపాల్ మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్ ముందు ఉద్యమ సహచరులతో కలిసి లొంగిపోయారు. మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఇదో షాకింగ్ పరిణామం. మల్లోజుల వేణుగోపాల్ రావు సొంత రాష్ట్రం తెలంగాణ. పెద్దపల్లికి పట్టణానికి చెందిన మల్లోజుల వెంకటయ్య, మధురమ్మ దంపతులకు వేణుగోపాల్‌రావు మూడో సంతానం. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న తండ్రి నుంచే వేణుగోపాల్, ఆయన రెండో అన్న కోటేశ్వరరావు స్ఫూర్తి పొందారు. చదువుకుంటున్న సమయంలోనే 1970 దశకంలో ఆయన రాడికల్ స్టూడెంట్స్ యూనియన్‌లో పనిచేశారు. అనంతరం అండర్ గ్రౌండ్‌కు వెళ్లారు. పార్టీ అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావుతో సమకాలికుడిగా పనిచేశారు. వేణు గోపాల్ ప్రధానంగా పొలిటికల్, ఐడియాలజికల్ లీడర్‌గా పేరు తెచ్చుకున్నారు. మిలిటరీ ఆపరేషన్స్ కంటే భావజాలం, ప్రకటనలు, లెటర్స్ ద్వారా ఉద్యమాన్ని గైడ్ చేశారు. ఆయనను 'అభయ్', అలియాస్ సోను, భూపతి, వివేక్, రాజన్ పేర్లతో పిలిచేవారు. మల్లోజులపై రూ.6 కోట్ల రివార్డు ఉన్నట్లు గడ్చిరోలి పోలీసులు ప్రకటించారు. వేణుగోపాల్ 1978లో ఐటీఐ కోర్సు చేశారు. కరీంనగర్ ఎస్సారఆర్ కళాశాలలో బీకాం చదివారు. అనంతరం ఆదిలాబాద్ ప్రజాసంబంధాల విభాగంలో అప్రెంటిస్‌షిప్ చేస్తూ.. తన అన్న పిలుపు మేరకు ఉద్యమంలో ప్రవేశించారు.

### అంచలంచెలుగా.. పొలిట్ బ్యూరో స్థాయికి

మల్లోజుల సుల్తానాబాద్ ప్రాంతంలో రాడికల్ విద్యార్థి యూనియన్‌లో పనిచేశారు. ఇదే ప్రాంతానికి చెందిన అగ్రనేత వడ్కాపూర్ చంద్రమౌళితో కలిసి నాటి పీపుల్స్‌వార్ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. 1981లో పూర్తిస్థాయిలో అజ్ఞాతంలోకి వెళ్లి ఏటూరునాగారం దళంలో సభ్యుడిగా చేరారు. 1982లో మహదేవపూర్ పోలీసులు వేణుగోపాల్‌ను అరెస్ట్ చేయగా.. మరుసటి ఏడాది విడుదలై మళ్లీ అడవిబాట పట్టారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతంలో కార్యకలాపాల్ని విస్తరించడంలో కీలకంగా వ్యవహరించారు. అలా 1993లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) కార్యదర్శిగా, 1995లో కేంద్ర కమిటీ సభ్యుడిగా, 2007లో కీలకమైన పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎదిగారు. దండకారణ్యంలో ముఖ్యమైన సెంట్రల్ రీజనల్ బ్యూరో (సీఆర్‌బీ) కార్యదర్శిగా ఉంటూనే జనతన సర్కార్‌కు మార్గదర్శకత్వం వహించారు. పార్టీలో అభయ్, సోను, భూపతి, వివేక్ పేర్లతో వ్యవహరించారు. ఆయనపై రూ.6 కోట్ల రివార్డు ఉన్నట్లు గడ్చిరోలి పోలీసులు ప్రకటించారు. పార్టీలో నంబర్‌టూగా ఉంటూ 2010లో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్ అధికారప్రతినిధిగా వ్యవహరించేవారు. తర్వాత పార్టీ ఆ బాధ్యతను వేణుగోపాల్‌రావుకు అప్పగించింది. చిన్నతనం నుంచి సాహిత్యాభిరుచి ఉన్న ఆయన.. ఆదివాసీల జీవనవిధానంపై ఉన్న అవగాహనతో తెలుగు, హిందీతోపాటు గోండు భాషలోనూ పట్టు సాధించారు. రాగో (గోండుభాషలో రామచిలుక) అనే నవలను 'సాధన' అనే కలం పేరుతో వెలువరించారు. అడవిలోని సరిహద్దుల్లో తమ రక్షణ చర్యలు ఎలా ఉండాలో వివరిస్తూ.. 'అడవిలో అన్నలు' అనే నవలను రచించారు. తరువాత దీన్ని 'సరిహద్దు' అనే పేరుతో ప్రచురించారు.





### మల్లోజుల సోదరులు కూడా..

మావోయిస్టు పార్టీలో మల్లోజుల సోదరులది చెరగని ముద్ర. పాతికేళ్ల ప్రాయానికి ముందే అజ్ఞాతంలోకి వెళ్లిన అన్నదమ్ములిద్దరూ అక్కడే తోటి ఉద్యమకారుల్ని పెళ్లిళ్లు చేసుకున్నారు. కిషన్‌జీ గద్వాల జిల్లా పెంచికలపాడు గ్రామానికి చెందిన పోతుల పద్మావతి ఎలియాస్ సుజాతక్కను వివాహం చేసుకున్నారు. అభయ్ మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా జిమల్‌గట్టకు చెందిన విమల చంద్ర సిడాం ఎలియాస్ తారక్కను పెళ్లి చేసుకున్నారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉద్యమంలో సుదీర్ఘకాలం కలిసే పనిచేశారు. 2011లో పశ్చిమబెంగాల్ అడవుల్లో కోటేశ్వర్‌రావు ఎన్‌కౌంటర్‌లో మరణించారు. సుజాతక్క నెల రోజుల క్రితం తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. అభయ్ భార్య తారక్క ఈ ఏడాది జనవరిలో మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ ముందు లొంగిపోయారు. వేణుగోపాల్ తల్లిదండ్రులిద్దరూ మరణించారు. పెద్దపల్లిలోని ఇంట్లో ఆయన పెద్దన్న ఆంజనేయులు నివసిస్తున్నారు.



# భారత్‌లో కామన్ వెల్త్ గేమ్స్

**మహా:** భారత్ మరోసారి అంతర్జాతీయ క్రీడా వేదికగా నిలవబోతోంది. 2030 కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ హక్కులను భారత్ దక్కించుకుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని వేదికగా ఎంపిక చేస్తూ కామన్‌వెల్త్ స్పోర్ట్ బాడీ నిర్ణయం తీసుకుంది. లక్షా 32 వేల సామర్థ్యం కలిగిన నరేంద్ర మోదీ స్టేడియం లాంటి ప్రపంచ ప్రఖ్యాత క్రీడా ప్రాంగణం ఉండటంతో అహ్మదాబాద్‌కు ఈ గౌరవం దక్కింది. నైజీరియాలోని అబూజా నగరంతో పోటీపడి అహ్మదాబాద్ ఆతిథ్య హక్కులు దక్కించుకుంది. నవంబర్ 26న గ్లాస్గోలో జరగనున్న సీడబ్ల్యూజీ జనరల్ అసెంబ్లీ సమావేశంలో ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. కామన్‌వెల్త్ గేమ్స్ ఆతిథ్య హక్కులను దక్కించుకోవడం భారత్‌కు ఇది రెండో సారి. 2010లో న్యూఢిల్లీ వేదికగా భారత్‌లో తొలిసారి ఈ క్రీడలు జరిగాయి. 2030 గేమ్స్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఇవి శతాబ్ది వేడుకలుగా జరగనున్నాయి. 1930లో తొలిసారి ఈ క్రీడలు పరిచయం చేయబడ్డాయి. నాడు కెనడాలో హామిల్టన్‌లో ఈ క్రీడలు జరిగాయి. భారత్‌కు కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ అవకాశం దక్కడంపై కామన్‌వెల్త్ గేమ్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు పి.టి ఉష స్పందించారు. 2030 కామన్‌వెల్త్ గేమ్స్ భారత యువతకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. ఈ క్రీడల నిర్వహణ కామన్‌వెల్త్ దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలపరిచే గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. కాగా, గత ఎడిషన్ (72వది) కామన్‌వెల్త్ గేమ్స్ ఇంగ్లండ్‌లోని బర్మింగ్హామ్ నగరంలో జరిగాయి. తదుపరి ఎడిషన్ వచ్చే ఏడాది జరుగనుంది. ఈసారి స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరం ఈ క్రీడలకు ఆతిథ్యమివ్వనుంది.

# అబద్ధాల పునాదుల మీద ఎల్లకాలం మనుగడ సాగదు

- కెసీఆర్ పాలన మళ్లీ రావాలంటున్న ప్రజలు
- ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తగు గుణపాఠం చెప్పాలి
- జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** కాంగ్రెస్ పార్టీ ప్రజా విశ్వాసం కోల్పోయిందని , కెసీఆర్ పాలన మళ్లీ రావాలని జనం బలంగా కోరుకుంటున్నారని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కు మద్దతుగా వెంగళరావు నగర్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ లో జరిగిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని ఆయన అభ్యర్థించారు. అబద్ధాల పునాదుల మీద ఎల్లకాలం మనుగడ సాగించాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగు గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడిచినా కనీసం ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో డ్రామాలాడి నిరుద్యోగులను మోసగించారని మండిపడ్డారు. నెలకు నాలుగు వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఐదు లక్షల విద్యాభరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీలు తదితర హామీలను తుంగలో తొక్కారని అన్నారు. ఎనిమిది వేల కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకుండా, గురుకులాలను నిర్వీర్యం చేసి పేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేస్తున్న కాంగ్రెస్ కు యువత, విద్యార్థులు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ వంచించిందని ఆయన విమర్శించారు. ఉప ఎన్నికల్లో, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలితేనే వారికి వారి హామీలు గుర్తుకు వస్తాయని చెప్పారు. లేదంటే మేమెన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు వాటినే నమ్ముతారని కాంగ్రెస్ నేతలు విర్రవీగుతారని అన్నారు. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ ఎంపిపి కృపేష్, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, చీరాల రమేశ్, బుగ్గ రాములు, బహదూర్ నాయక్, భాస్కర్ రెడ్డి, మంద సురేష్, జెర్కోని రాజు, భరత్ రెడ్డి, యాదయ్య గౌడ్, పరుశురాం నాయక్, సత్యపాల్, శివసాయి, పవన్, ప్రేమ్ కుమార్, జానీపాష, వీరేశ్, శివారెడ్డి, వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పందుల నివారణ కోసం చర్యలు తీసుకుంటాం

**నార్సింగి కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి**

**గండిపేట, మహా:** నార్సింగి మున్సిపాలిటీ లోని ఖానాపూర్ లో పందులు బెడద అధికంగా ఉండటంతో వ్యాదులు ప్రబలకుండా నివారణ చర్యలను చేపట్టాలని నార్సింగి మున్సిపాలిటీ అధికారులను గ్రామస్తులు కోరటం తో కోరటంతో, బుధవారం సంబంధిత సానిటేషన్ అధికారి లచ్చిరాం ఆధ్వర్యంలో బుధవారం పందులను మున్సిపల్ సిబ్బంది ద్వారా పట్టించి దూర ప్రాంతాలలో వదిలిపెట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతే కాకుండా నార్సింగి మున్సిపాలిటీలో పారిశుద్ద కార్యక్రమాలకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని, మున్సిపాలిటీలో పారిశుధ్య సమస్య ఉన్నట్టయితే తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అమరేందర్ రెడ్డి, గ్రామ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**మొయినాబాద్ మహా:** గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు పేద రోగులకు ఎంతో ఉపయోగకరమని అప్పోజిగూడ మాజీ సర్పంచ్ రాజు పేర్కొన్నారు. మండలంలోని అప్పోజిగూడ గ్రామంలో నగరానికి చెందిన కేఎంఆర్ ఫౌండేషన్, కామినేని ఆసుపత్రి వారి అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ రాజు పాల్గొని ప్రారంబించి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి కేఎంఆర్ ఫౌండేషన్, కామినేని ఆసుపత్రి వారి అధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ గ్రామంలోని పేద ప్రజలకు ఆరోగ్య సేవాలను అందిస్తున్నారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఇలాంటి శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 95 మందికి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులతో పాటు కేఎంఆర్ ఫౌండేషన్, కామినేని ఆసుపత్రి ప్రతినిధులు సంతోష్ కుమార్, నందు, అంజనేయులు, యామిని, గ్రామస్తులు పాల్గొన్నారు.



## భవిష్యత్తు పై ఆలోచనతో ముందుకు సాగాలి

- విద్యార్థుల భవిష్యత్ కోసం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్
- టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి

**ఆమనగల్లు, మహా:** విద్యార్థుల భవిష్యత్ కోసం తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ఆధ్వర్యంలో మరో గొప్ప కార్యక్రమని టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిఅన్నారు.బుధవారం మాసబ్ ట్యాంక్ లోని టాస్క్ కార్యాలయంలో టాస్కఆధ్వర్యంలో ప్రముఖ శిక్షణ సంస్థ సహకారంతో విద్యార్థులకు కండిషనల్ ఆఫర్ లెటర్లను సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ టాస్క్ ఎల్లప్పుడూ యువత గొప్ప భవిష్యత్తు కోసం కృషి చేస్తుందని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు 6 నెలల పాటు 360డిజి టిఎంజీ లో శిక్షణ పొందనున్నారని 360డిజి టిఎంజీ అనేది డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్,బిగ్ డేటా,అనలిటిక్స్ మరియు డిజిటల్ టెక్నాలజీలలో ప్రాక్టికల్ శిక్షణను అందించే ప్రముఖ సంస్థ, అన్నారు.360డిజి టిఎంజీ విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేస్తూ ,ట్రైనింగ్ పూర్తయ్యాక వారికి ప్రముఖ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. టాస్క్ ద్వారా ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందిస్తూ,వారికి గొప్ప భవిష్యత్ అందించే దిశగా ముందుకు సాగుతూ,ఉపాధి అవకాశాల కల్పనకు గొప్ప వేదికగా నిలుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు..మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ పడాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టాస్క్ మీ తోడుగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో.. టాస్క్ సి.ఇ.ఓ శ్రీకాంత్ సిన్హా గారితో పాటు టాస్క్ మరియు 360డిజి టిఎంజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

**మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వంటి అంశాలపై అవగాహన సదస్సు, డిసిపి సునీత రెడ్డి నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులతో సైబర్ నేరాల పట్ల గంజాయి వంటి మాల్కద్రవ్యాల వినియోగం, రోడ్డు భద్రత వంటి క్లిష్టమైన అంశాలపై మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవి రాజుతో కలిసి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిసిపి మాట్లాడుతూ... డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు చెడు మార్గంలో కాకుండా సరైన మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.



నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకాలు కావాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎసిపి, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, కళాశాల లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో వెటర్నటీ డిపార్ట్‌మెంట్ ఉండాలి

**ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**యాదగిరిగుట్ట, మహా:** వెటర్నరీ డిపార్ట్మెంట్ రైతులకు అందుబాటులో వుండాలని ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య అన్నారు బుధవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామంలో ఉచిత గాలి కుంటు టీకా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి వచ్చిన రైతుల పశువుల కోసం మెడిసిన్ అందజేశారు ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు వ్యవసాయానికి వెన్నెముకల ఉండేవి పశువులు వాటిని సంరక్షించడం మన బాధ్యత అన్నారు.. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత గాలి కుంటు వ్యాధి టికాను రైతులందరూ తమ పశువులకు ఉపయోగించుకోవలన్నారు. మన



ప్రాంత రైతులు వ్యవసాయం తో పాటు డైరీ మీద కూడా ఎక్కువ ఆధారపడుతున్నారని అన్నారు. వెంటర్నేటి డిపార్ట్మెంట్ వారు రైతులకు అందుబాటులో ఉండి వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీ నేతులు పాల్గొన్నారు.

## నర్సాపురం సందర్శించిన అధికారులు

**వలిగొండ, మహా :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వలిగొండ మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో వర్షపు నీరు ఇండ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడడంతో మండల సబ్ ఇన్స్పెక్టర్ యుగంధర్ గౌడ్ తహసిల్దార్ దశరథ ఎంపీడీవో జలంధర్ రెడ్డి బుధవారం గ్రామాన్ని సందర్శించి జెసిబి తో కాల్వ తీయించి నీటిని బయటకు పంపించడం జరిగింది. శాశ్వత పరిష్కారం కోసం ఇటీవల మెయిన్ రోడ్డు వలిగొండ నుండి తొర్రూరు వరకు వేసిన రోడ్డు ఎత్తు ఉండడం వలన దానికి నేషనల్ హైవే అథారిటీ వారితో సంప్రదించి శాశ్వత పరిష్కారం చేయాలని వారితో అధికారులు ఫోన్లో మాట్లాడి శాశ్వత చర్య తీసుకోవాలని కోరారు

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**ఆలేరు, మహా:** ప్రభుత్వం ధాన్యం సేకరణకు ఈ సంవత్సరం 25 వేల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని రోడ్లు భవనాల & సిని ఆటోగ్రాఫ్ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు... యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం నాడు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మార్కెట్ ఛైర్మన్ చైతన్య రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ధ్యానం అమ్మిన 48 గంటల్లో రైతుల అకౌంట్ లో డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకున్నమన్నారు.. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర విషయంలో ఎక్కడ రాజీ పడేది లేదని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని అన్నారు...



అకాల వర్షాలకు తడిసిన ధాన్యం ప్రతి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు ,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సంస్థ బకాయిలపై ప్రభుత్వం, యాజమాన్యం స్పందించాలి

**నస్పూర్ మహా :** గెలిచిన గుర్తింపు సంఘాలు లాభాల ప్రకటన కార్యక్రమానికి హాజరై చెక్కుల పంపిణీలో పాల్గొని బయటికి వచ్చి నిరసన తెలియజేశామనడం హాస్యాస్పదమని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. నస్పూర్ పరిధిలోని శ్రీరాంపూర్ ఎస్ ఆర్ పి 1 గనిలో బుధవారం జరిగిన సిఐటియు యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంస్థకు రావాల్సిన 42వేల కోట్ల బకాయిలు బయట స్టేట్మెంట్లకే పరిమితమవుతున్నారు . తప్పు దొరికినా వేదిక మీద యాజమాన్యాన్ని ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. గత సంవత్సరం కన్నా ఎక్కువ లాభాలు వచ్చాయని చెప్తున్నా యాజమాన్యం 1% వాటా పెంచిన కూడా ఇప్పటివరకు కార్మికులకు గత సంవత్సరం కన్నా తక్కువ లాభాలే పంపిణీ చేశారని ఈ విషయంలో కార్మికులు చాలా అసంతృప్తితో ఉన్నారని అన్నారు. అవకాశం దొరికినా స్ట్రక్చర్ సమావేశంలో దసరా సెలవు మార్పు చేయించలేక సమావేశాన్ని వాయిదా వేసి వచ్చి, కార్మిక సమస్యలను తీర్చే వేదికను బహిష్కరించడం వలన సాధించినది ఏమిటనీ ప్రశ్నించారు .ఉద్యోగాలు ఇచ్చినప్పుడు గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు, వేదికల మీద ఉన్న గుర్తింపు ప్రాథమిక సంఘాల నాయకులు ,ఇన్వాల్యుడేషన్ అయిన డిపెండెంట్ లకు ఉద్యోగాలు ఇవ్వడంలో సరిసప్పుడు



చేయడం లేదని అన్నారు .మెడికల్ బోర్డు ఎత్తివేస్తున్నారనే ప్రచారం జోరుగా జరుగుతున్నా దానిపై గెలిచిన సంఘాలు మౌనం వినడం లేదని మండిపడ్డారు . సమస్యలు పరిష్కరించకుంటే అన్ని సంఘాలను కలుపుకొని పోరాటం చేస్తామన్న గుర్తింపు సంఘం నాయకులు ఎన్నికలు జరిగి రెండు సంవత్సరాలు దాటినా సమస్యలు పరిష్కరించకపోవడంలో విఫలమయ్యారని తెలిపారు .ఇప్పటికైనా అన్ని సంఘాలను కలుపుకొని పోరాటాలకు పిలుపునివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి పూర్తి బాధ్యత కోల్ బెల్టు ప్రాంత ఎమ్మెల్యేలు వహించాలని లేదంటే భవిష్యత్తులో గత ప్రభుత్వ కోల్ బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధుల ఎమ్మెల్యేల పరిస్థితిని గమనించాలని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ ,రాష్ట్ర కమిటీ సభ్యులు కస్తూరి చంద్రశేఖర్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్ ,బ్రాంచ్ నాయకులు వెంకట్ రెడ్డి గోపాల్ సింగ్ రాథోడ్, పాల్గొనడం జరిగింది.

## అప్పుల బాధతో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**గండిపేట, మహా :** అప్పుల బాధ తాళలేక చెట్టుకి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల లో జరిగింది. నార్సింగి సిఐ హరికృష్ణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15వ తేదీ మృతుని భార్య మాకపల్లి ఉమారాణి తెలిపిన సమాచారం ఆధారంగా మృతుడు ఎం బి. రాములు (50), తండ్రి లేట్ జంగయ్య, నివాసం రాందేవ్ గూడ, గోల్కొండ మండలం, వృత్తిరీత్యా ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ గా పని చేస్తూ జీవిస్తుండగా, కుటుంబ భారంతో అప్పుల పాలు కావటంతో మానసిక ఆందోళనకు గురై భార్యతో గొడవపడి ఇంట్లో నుండి 14 వ తేదీన బయటకు వెళ్లి తిరిగిరాలేదని తెలిపారన్నారు. 15 వ తేదీన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామం సమీపంలోని వేణుగోపాల స్వామి ఆలయ సమీపంలో గుర్తుతెలియని చెట్టుకి వ్యక్తి ఉరివేసుకున్నాడని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపిన అనంతరం మృతుడు ఆమె భర్తగా గుర్తించగా, మృతుడు అప్పుల బాధతో మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని ప్రాథమిక అంచనాకు వచ్చిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించమన్నారు.

## సింగరేణి సౌత్ క్రాస్ కట్ గని స్థలాన్ని రక్షించాలి

**ఆక్రమిత స్థలంలోని గోడలను గేట్లను తొలగించాలి**

**కబ్జాకు గురవుతున్న స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలి**

**బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ డిమాండ్**




**బెల్లంపల్లి, మహా:** సింగరేణి సౌత్ క్రాస్ గాడు గని స్థలాన్ని కాపాడి పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గేట్లను నిర్మించి స్థలాన్ని ఆక్రమించే విధానాన్ని నిరోధించేందుకు సింగరేణి యాజమాన్యం ప్రహరీ గోడ నిర్మించి రక్షించాలనిబెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మందమర్రి జనరల్ మేనేజర్ రాధా కిషన్ కి బుధవారం నాడు వినతి పత్రం అందజేశారు. అనంతరం బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీనాయకులు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో 1928వ సంవత్సరంలో బొగ్గుగనులు ప్రారంభించడం జరిగినదని పట్టణంలో అనేక బొగ్గు గనులతో కార్మికబస్తీలతో నిండు పున్నమి చంద్రునిలా పట్నం వికసించేదని సింగరేణి కంపెనీకి 80 సంవత్సరాలుగా సిరులు అందించిన పట్టణంలో బజార్ ఏరియాకు సౌత్ క్రాస్కట్ బొగ్గు గని నడిపించిందని ఈ గణికి అనుకొని క్యాంటీన్ ఎస్ఎంపి ఆఫీస్, కోల్ శాంపిల్ఆఫీస్, సివిల్ డిపార్ట్మెంట్, ల్యాంప్ క్యాబిన్ కార్యాలయం కూడా ఉండేవని కన్యకా పరమేశ్వరి దేవాలయము, పద్మశాలిఫంక్షన్ హాలు స్థలంలో సివిల్ డిపార్ట్మెంట్ కాంట్రాక్టు క్యాజువల్ వర్కర్స్ ను డిస్ట్రిబ్యూషన్ చేసే ఆఫీస్ మరియు సిమెంట్ పోల్స్ సిమెంట్ ఇటుకలు ఈ స్థలంలో తయారు చేసే వారనీ, సింగరేణి అధికారులు గతంలో పనిచేసిన వారు ఇట్టి స్థలాన్ని రెండు దేవాలయాలకు ఇవ్వడం జరి గిందని పద్మశాలి భవన్ లో ఇప్పటికీ సింగరేణి యాజమాన్యం ఇచ్చిన స్థలం కాంపౌండ్ వాల్ లోపల ఇంకా ఖాళీ స్థలం ఉన్నప్పటికీ కాంపౌండ్ అవతలి స్థలాన్ని దురుద్దేశంతో కబ్జా చేసేందుకు కాంపౌండ్ వాల్ అవతల దేవుని విగ్రహాలు పెట్టి దేవుని పేరిట పూజలు చేయడం అంటేనే ఖాళీ స్థలాన్ని కబ్జా చేయడం సమంజసంగా లేదని మసీ దుకు ఇచ్చిన స్థలం కాకుండా పక్కన ఉన్న స్థలాన్ని కబ్జా చేస్తు నిర్మాణం చేస్తున్నారని ఇది కూడా సమంజసంగ లేదని ఈ విషయంలో సింగరేణి యాజమాన్యం సింగరేణి అధికారులు వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకొని స్థానికఎమ్మెల్యే మీ వినోద్ సైతం దృష్టి సారించి కబ్జా చేసిన వారి నుండి సింగరేణి స్థలాన్ని ఖాళీ రక్షించడానికి సింగరేణి యాజమాన్యానికి సహకరించాలే తప్ప కబ్జాదారులను ప్రోత్సహించడం ఏమాత్రం భావ్యం కాదన్నారు. సింగరేణి సీ అండ్ ఎండి వాస్తవ పరిస్థితులపై దృష్టి సారించి పూర్తిస్థాయి విచారణ జరిపించి CMD సింగరేణి గారు వాస్తవాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని అలాగే కొన్ని సంవత్సరాల క్రితం ఉత్పత్తి ఉత్పాదకత అవసరాల రీత్యా ఏర్పాటు చేసిన ఎక్స్ప్లోరేషన్ డివిజన్ ఆఫీస్ ఏజెంటు ఆఫీస్ వర్క్ షాప్ పవరాజ్ ఓల్డ్ సీఎస్పీ మహమ్మద్ హుస్సేన్ సెట్ టింబర్ యార్డ్ ఓల్డ్ జిఎం ఆఫీస్ టింబర్ డిపార్ట్మెంట్ ఆఫీసులో ఉన్నవి ఈ భూములను కాపాడాలని సింగరేణి ఉన్నత యాజమాన్యానికి బెల్లంపల్లి ప్రాంతంలో ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రజలకు ఇట్టి భూములను సింగరేణి స్థలాలను కబ్జా కోరుల నుండి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం పద్మశాలి భవన్ ముందు నిర్మించిన అక్రమ కట్టడాలను, మసీదు పేరుతో ఆనుకొని ఉన్న స్థలాన్ని కబ్జా చేయడం నిలిపివేయాలని కోరుతున్నాం పద్మశాలి భవన్ కాంపౌండ్ వాల్ కు నిర్మించిన రెండు గేట్లను తొలగించి అట్టి స్థలంలో గోడలు నిర్మించాలని కబ్జాకు గురవుతున్న స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ సభ్యులు సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య,దాగం మల్లేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బెల్లంపల్లి పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ , కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ గెల్లి రాయలింగు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గెల్లిజయరాం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి అఫ్జల్, సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు రత్నంరాజం, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఆనంద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మహేష్, ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ గోడప్రతులు విడుదల

**మంచిర్యాల, మహా :** పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ గోడప్రతులను దీపక్ కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, ఇతర అధికారులతో కలిసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల సంబంధిత గోడప్రతులను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల సకాలంలో ఇవ్వాలని అన్నారు. అక్టోబర్ 15 నుండి నవంబర్ 14 వరకు ప్రతి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. 4 నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకాలు అందించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు సంరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. 2 లక్షల 42 వేల పశువులకు ఇ టీకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 35 బృందాల ద్వారా 94



మంది పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు టీకాలను అందిస్తారని చెప్పారు. ఈ వ్యాధి కారణంగా పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని అన్నారు. పునరుత్పత్తి, పని సామర్థ్యం తగ్గడంతో పాడి రైతులకు నష్టం జరుగుతుందని, దీనిని నివారించేందుకు ప్రతి పశువుకు టీకాలు అందించాలని సూచించారు. టీకాలు వేసిన ప్రతి పశువుకు గుర్తింపు చెవిపోగు వేసి వివరాలను భారత్ పశుధన్ యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. గ్రామ పెద్దలు, రైతులు తమ పశువులకు టీకాలు వేయించి వాటి సంరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

**ఆమనగల్లు, మహా:** భారత మాజీ రాష్ట్రపతి, భారత రత్న అవార్డు గ్రహీత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జయంతిని పురస్కరించుకుని కలాం చిత్రపటానికి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మి నివాస్, టిఎస్ఎస్ఓ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జి మీసాల చిక్కి, కమిటీ సభ్యులతో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి నివాస్ మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్‌కలాం భారత అణురంగంలో అత్యున్నతస్థాయికి చేరి అనేక సేవలు అందించిన గొప్ప శాస్త్రవేత్త అని అన్నారు. అలాగే ఆయన రాష్ట్రపతిగా దేశానికి సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ కమిటీ సభ్యులుమహేందర్,శివ,రాజు,అభి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## చిలుకూరు బాలాజీని దర్శించుకున్న సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్

**మొయినాబాద్ మహా:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరు బాలాజీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సీఈఓ దివ్య దేవరాజన్ దర్శించుకున్నారు. బుధవారం మండలంలోని చిలుకూరు బాలాజీకి వచ్చిన ఆమెకు ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్. రంగరాజన్ స్వాగతం పలికి స్వామివారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ విశిష్టతను ఆమెకు రంగరాజన్ వివరించారు. ప్రముఖ చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సం దర్భంగా దివ్య దేవరాజన్ పేర్కొన్నారు. అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రపంచంలో మంచి గుర్తింపు తీసుకువస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ చేస్తున్న సేవాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్, రంగారెడ్డి జిల్లా వికలాంగుల సమాఖ్య అద్యక్షుడు వడ్ల నర్సింహ్మాచారి, మండల రెవెన్యూ అధికారి రాజేష్, భాస్కర్, జ్ఞానేశ్వర్ గౌడ్,



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలి

- 18వ తేదీన రాష్ట్ర బంద్ కు పిలుపు
- బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య

**రాజేంద్రనగర్, మహా :** బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి జీవో నెంబర్ 9ను అమలు పరచాలని రంగారెడ్డి జిల్లా బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీలు 62% ఉంటే రాష్ట్ర ప్రభుత్వం 42 శాతానికి స్థానిక ఎన్నికలలో అభ్యర్థులు ఖరారు చేసిన ఇంప్లిమెంటేషన్ కాలేకపోయింది. బీసీల బిడ్డల కడుపు కొట్టేలా అగ్రకులాలు అవలంబిస్తున్నాయి వారి ఆలోచనలను తిప్పి కొట్టడానికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 18 వ తారీఖున పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్ట నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు, రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి, బుద్ధుల జంగయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ప్రభు లింగం, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు యాదగిరి, ఎం ఏ రియాజ్, నీలమ్మ, సిపిఐ మండల కార్యదర్శి నర్సిగిరి, జిల్లా సమితి సభ్యులు ఆనంద్ గౌడ్, రమావత్, సక్రు నాయక్, కమలమ్మ, యాదమ్మ, మంజుల, సత్తిరెడ్డి, మల్లేష్, సురేష్, సుధీర్, బిఓసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అన్నెపు ప్రభు, డి జంగయ్య, కే రాములు, బి చంద్రయ్య ఆనంద్ టి శంకరయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

**క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్, కేసుల పరిష్కార శాతం పెంపు**

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల, మహా :** రామగుండం కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి డిసిపి లు, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో సెప్టెంబర్ మాసం నేరా సమీక్షలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కమిషనరేట్ పరిధి డిసిపి లు, అడిషనల్ డీసీపీ అడ్మిన్, ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్, కేసుల పరిష్కార శాతం పెంచాలని సూచించారు. అలాగే పాత యు.ఐ. అండ్ పీ.టీ. కేసులను త్వరగా పరిష్కరించి, కేసుల దర్యాప్తులో విషయంలో అధికారులు ప్రస్తుత అందుబాటులో వున్న టెక్నాలజీతో పాటు, శాస్త్రీయ పద్ధతిను కూడా అనుసరిస్తూ దర్యాప్తు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రధానంగా మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి కేసుల్లో దర్యాప్తు పారదర్శకంగా నిర్వహించి నిందితులకు న్యాయస్థానంలో శిక్షలు పడేవిధంగా తగు సాక్ష్యాధారాలను కోర్టుకు అంద జేయాలని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, కేసులు, పోక్సో కేసు లలో బాధితులకు కంపెన్సేషన్ త్వరగా అందేలా చూసి, కన్విక్షన్ శాతాన్ని పెంచాలని అన్నారు. ప్రాపర్టీ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి నేరాల నియంత్రణ కు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిందితుల పట్టుకొనేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి టీమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధగంట సమయం ప్రధాన చౌరస్తా, గ్రామాల వారిగా రోడ్ పై విజిబుల్ గా ఉండాలని కోరారు. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ చేయడం వలన మీ మీ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ ప్రెసెన్స్ కనిపిస్తుందని చెప్పారు. తద్వారా మీ గుర్తింపు, పోలీస్ శాఖ కీర్తి పెరుగుతుందని వివరించారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం యువత చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ విభాగంతో కల్సి పనిచేయాలని తెలిపారు. పాఠశాలు, కళాశాలు, విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేసి, రోడ్ రక్షణ వాలింటర్స్ ను తయారు చేయాలని ఆదేశించారు. ప్రస్తుత సైబర్ క్రైమ్స్ అనేది ఒక పెద్ద సమస్యగా మారిందని అన్నారు. సైబర్ నేరాల నివారణకు ఇంటిగ్రేట్ గ్రామాలు పట్టణ ప్రాంతాలలో అవగాహన కల్పించాలని కోరారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారని సమాచారం అందితే ఆయా కేంద్రాలలో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారుల పనితీరుపైనే రామగుండం పోలీస్ కమిషనరేట్ కీర్తి ప్రతిష్టలు ఆధారపడి ఉన్నాయని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

## జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ టెక్నికల్ అఫీషియల్ సంతోష్ యాదవ్



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న సల్ల సంతోష్ యాదవ్ హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో అక్టోబర్ 16 నుండి 18 వరకు జరుగనున్న 5వ ఇండియన్ ఓపెన్ అండర్ 23 నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు టెక్నికల్ అఫీషియల్ గా నియమితులైనట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, మంచిర్యాల జిల్లా కార్యదర్శి ఈ.మారయ్య తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కు టెక్నికల్ అఫీషియల్ గా సంతోష్ నియామకం పట్ల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ రవి ప్రసాద్ ప్రధానోపాధ్యాయులు రాజా రమేష్ తోపాటు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, బెల్లంపల్లి పట్టణ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

# దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎస్పీ



**ఆదిలాబాద్ మహా :** ఆదివాసీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం భీంపూర్ మండలం భగవాన్పూర్, గుబిడి గ్రామాలలో ఆయన పర్యటించారు. దీపావళి సందర్భంగా ఆదివాసీలు జరుపుకునే దండారి వేడుకల్లో ఆయన డీఎస్పీ జీవన్ రెడ్డి ఇతర పోలీస్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఆదివాసీల సాంప్రదాయ గుస్సాడి నృత్యాలలో పోలీస్ అధికారులు తమ కదం కలిపి వారిని ఉత్సాహపరిచారు. ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేలా వేడుకలను నిర్వహించాలని ఎస్పీ సూచించారు. వారి పిల్లలకు విద్య పై ప్రాధాన్యతను పెంచి బాగా చదివించాలని సూచించారు. అనారోగ్య సమస్యలకు మూఢ నమ్మకాలతో భూత వైద్యులను మంత్రగాళ్ళను ఆశ్రయించవద్దని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులను సంప్రదించి చికిత్సలను తీసుకోవాలన్నారు.మంత్రాలు తాయిత్తులతో రోగాలు నయం చేస్తామనే బాబాలను నమ్మవద్దని సూచించారు.జిల్లా పోలీసుల సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం ఆదివాసీలతో కలిసి సామూహిక భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సిఐ జి శ్రావణ్, భీంపూర్ ఎస్ఐ విక్రమ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుంది

**ఏఐసీసీ పరిశీలకులు అజయ్ సింగ్.. బోథ్ లో సంఘటన్ శ్రుజన్ అభయాన్ కార్యక్రమానికి హాజరు**




**ఆదిలాబాద్ మహా :** క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులు తెలుసుకునేందుకు సంఘటన్ శ్రుజన్ అభయాన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఏఐసీసీ పరిశీలకులు అజయ్ సింగ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.డీసీసీల నియామక ప్రక్రియ చాలా పారదర్శకంగా జరుగుతుందని ఆయన తెలిపారు. అందుకే దీనిని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధిష్టానం ఏఐసీసీ పరిశీలకులను పంపిందని అన్నారు. ప్రతి ఒక్కరి అభిప్రాయాలు తీసుకుని జాబితా అధిష్టానికి పంపుతామన్నారు. పార్టీని నమ్ముకుని కష్టపడి పని చేస్తే తప్పకుండా గుర్తింపు వస్తుందని అన్నారు.అవకాశం రాలేదని నిరాశ పడవద్దని ఆలస్యమైనా తప్పకుండా గుర్తింపు దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సంఘటన్ శ్రుజన్ అభియాన్ సమన్వయ కర్త గడ్డం చంద్రశేఖర్ రెడ్డి,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాంభూపాల్, కార్యక్రమ కోఆర్డినేటర్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు జితేందర్, బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జిలు ఆడె గజేందర్, కంది శ్రీనివాస రెడ్డి,డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఏఐసీసీ మెంబర్ నరేష్ జాదవ్ , ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలి








## చైర్మన్ అల్లాజీ గౌడ్

**ఆమనగల్లు, మహా :** విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదువుకోవాలని కళాశాల చైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్ అన్నారు.బుధవారం మాస్టర్ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను భవాని గార్డెన్లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అల్లాజీ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకి పుస్తక పఠనం చాలా అవసరమని, శాస్త్రవేత్తలు, న్యాయవాదులు, మంచి అధ్యాపకులుగాకావాలన్నారు.విద్యార్థులకు విద్యా విధానంపై, జీవితంలో వారు సాధించాల్సిన లక్ష్య సాధనకు కావాల్సిన పలు సూచనలు అందించారు. విద్యార్థులు చెడు దోవ పట్టకుండా, మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు.ఈకాలేజీలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి కాలేజీకి కీర్తి, ప్రతిష్టలుతీసుకురావాలన్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురుని ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చందు నాయక్,నాగరాజు, శివలింగం, చెన్నయ్య, నాగరాజు, నిరంజన్ గౌడ్, అధ్యాపకులు కిష్టయ్య, యాదయ్య, శివకుమార్, వామన్ కుమార్, వంశీ, విశ్వం, బిక్షపతి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

**కబ్జాల చెర నుంచి సుమారు 140 కోట్లు విలువచేసే భూమికి విముక్తి**






**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ మండలంలో అక్రమ కబ్జాలను హైడ్రా అధికారులు బుధవారం తొలగించారు. బద్వేల్ , ఉప్పరపల్లి గ్రామాల్లో జన చైతన్య లేఔట్ ఫేజ్ 1, 2, లలో ఆక్రమణలకు గురైన 4 పార్కు స్థలాలకు హైడ్రా విముక్తి కల్పించింది. పార్కు స్థలాల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు నాయకులు ఆక్రమించారు. ఆక్రమణదారుల నుంచి హైడ్రాధికారులు సుమారు 140 కోట్ల భూమిని స్వాధీనం చేసుకున్నారు.

**దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్**

I & II పేరుతో హుడా అప్రూవల్ తో ఏర్పాటు చేసిన జనచైతన్య లేఔట్ లో పార్కులు కబ్జాకు గురయ్యాయని,హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కబ్జాలు జరిగినట్టు హైడ్రా అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు బుధవారం కబ్జాలను జెసిబి ల సహాయంతో ప్రహరీ ప్రికాస్టులను తొలగించారు. ప్రహరీలతో పాటు వేసిన షెడ్డులను , రూమ్ లను హైడ్రా తొలగించి వేశారు. 3 వేలు,వెయ్యి గజాలు, అయిదు వందల గజాల చొప్పున ఆక్రమించి నిర్మించిన షెడ్డులను నేలమట్టం చేశారు. ఆక్రమణల తొలగింపు తర్వాత వెను వెంటనే ఫెన్సింగ్ పనులు చేపట్టారు.



## కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో

# నేడు ప్రజాదర్బార్

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 10 గంటనుండి ప్రజాసేవాభవన్ లో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.నియోజక వర్గంలోని ఆదిలాబాద్ పట్టణంతో పాటు అన్ని మండలాలలోని గ్రామాల ప్రజలు తమ సమస్యలు తెలుపుకునేందుకు ప్రజాదర్బార్ ఓ చక్కని పరిష్కార వేదికగా నిలుస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తెలంగాణ రైజింగ్ విజన్ - 2047

**డాక్యుమెంటరీలో ప్రతి ఒక పౌరుడు పాల్గొనాలి**

**జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి**



**రంగారెడ్డి జిల్లా మహా:** తెలంగాణ రాష్ట్రాన్ని రానున్న రోజులలో అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్ 2047 అంశాలతో డాక్యుమెంటును రూపొందిస్తున్నదని, ఈ సర్వేలో ఉద్యోగులందరు పాల్గొనాలని, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతి ఒక్క పౌరుడు భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టారు. అక్టోబర్ 10 వ తేదీన ప్రారంభమైన ఈ సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్.ఆర్.ఐలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. కాగా, ఈ తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సర్వే లో రాష్ట్రంలోని ప్రతీ ఉద్యోగి పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిస్తూ ఈ నెల 14వ తేదీ మంగళవారం సర్క్యులర్ జారీ చేసింది. ఈనెల 25 వ తేదీ వరకు జరిగే విజన్2047 సర్వేలో అందరు ఉద్యోగులు పాల్గొనడం తోపాటు ఈ సర్వే లింక్ ను, క్యూఆర్ కోడ్ ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఆ సర్క్యులర్ లో ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంటరీని రూపొందించడంలో ప్రతి రాష్ట్ర పౌరుడు భాగస్వామ్యమై సిటిజన్ సర్వేలో పాల్గొని తమ ఆలోచనలను పంచుకోవాలని తెలిపారు.



## నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు త్వరగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి: కార్పొరేటర్ తోకల

**రాజేంద్రనగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, లక్ష్మీ గూడ, బృందావన్ కాలనీల లో రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి నూతన భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ పనుల కోసం హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి అధికారులతో కలిసి బుధవారం కాలనీలలో పర్యటించారు. పెండింగ్ లో ఉన్న పలు సిసి రోడ్డు పనులను, భూగర్భ డ్రైనేజ్ పైపులైన్ బృందావన్ కాలనీ లోని పుల్లిగుట్ట నాలా పనులను పర్యవేక్షించారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పనకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజా సమస్యలపై శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, ఆడికే జనార్ధన్, హనుమంత్ రెడ్డి, ఆడికే శివ, ధనరాజ్, సతీష్, రంజిత్ సింగ్, రజనీకాంత్, శ్రీకాంత్ రెడ్డి, అనిల్ రాజు శంకర్ రెడ్డి, బస్తి వాసులు తదితరులు పాల్గొన్నారు.




## తండ్రిని హతమార్చిన కొడుకు

**ఆదిలాబాద్ మహా :** నిర్మల్ జిల్ల తానూర్ మండలం ఏల్వి గ్రామంలో ఆగస్టు 31 న మిస్సింగ్ అయిన పన్నెవాడ్ లక్ష్మణ్ కేసును పోలీసులు చేధించారు బుధవారం నిర్మల్ జిల్లా ఎస్పి జానకి షర్మీల మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కన్న కొడుకే తండ్రిని కడతేర్చాడని అన్నారు. లక్ష్మన్ మిస్సింగ్ కేసు అనంతరం విచారణ కొనసాగుతుండగా గత రెండు రోజుల క్రితం వారి పంటపోలంలో ఓ కుక్క ఒక శవాన్ని పీక్కుతిన్న ఘటన వెలుగు చూసింది. దీంతో తీగలాగితే డొంక కదిలింది.పోలీసుల ఇన్వెస్టిగేషన్ లో కన్న కొడుకె హత్య చేసి పూడ్చిపెట్టినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.అతడిని తమదైన స్టైల్ లో ప్రశ్నించగా నేరం చేసినట్టు అంగీకరించాడు. ప్రతీ రోజు కొడుకుని తండ్రి విపరీతంగా తిడుతుంటాడని దీంతో కోపంతో తమ పంట పోలంలో గొడ్డలితో తలపై మోది హత్యచేసి పూడ్చిపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేష్, తానూర్ ఎస్సై జుబేర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# సిపిఆర్ పైన స్వచ్ఛంద సంస్థల అవగాహన సదస్సు

**ఒక వ్యక్తి జీవితాన్ని కాపాడే సిపిఆర్.. సిపిఆర్ పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి**





**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సిపిఆర్ పైన అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈనెల 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా, సిపిఆర్ అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా బుధవారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ ఆరోగ్య మిషన్, ఈఎంఆర్ఐ జిహెచ్ఎస్ 108 సర్వీసు సంయుక్తంగా, సిపిఆర్ పైన అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, మనిషిని పోలిన బొమ్మతో సిపిఆర్ చేస్తూ, మండల కార్యాలయం సిబ్బందికి అవగాహన కల్పించారు. సిపిఆర్ అనేది అత్యవసర సమయంలో గుండె ఆగిపోయిన వ్యక్తికి వెంటనే చేయవలసిన ప్రాణ రక్షణ చర్య ఇది. ఇలా చేయడంతో రక్త ప్రసరణ కొనసాగించడంలో పాటు మెదడుకు ఆక్సిజన్ సరఫరా చేయడంలో సహాయపడుతుంది.

**ఒక వ్యక్తి జీవితాన్ని కాపాడే సిపిఆర్...**

ఈ మధ్యకాలంలో సమాజంలో అనేకమందికి గుండెపోటు రావడం జరుగుతుంది. ఇలాంటి సిపిఆర్ పై చాలామందికి అవగాహన లేకపోవడం కారణంగా ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా పైన తెలిపిన స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఏర్పడి, సిపిఆర్ పై ప్రజలకు, ఉద్యోగులకు, కార్మికులకు అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుంది. సిపిఆర్ పై ప్రజలకు అవగాహన ఉండడంతో, గుండెపోటు వచ్చిన వ్యక్తికి వెంటనే సిపిఆర్ చేసి అతని ప్రాణాలు కాపాడడం జరుగుతుంది. క్షతగాత్రులను పరిసర ప్రాంతాల్లోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించడం జరుగుతుందని ఆ వ్యక్తికి జీవితాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీ ఎంహెచ్ఓ సుధా మాధురి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరిత, డాక్టర్ ప్రియాంక, ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ రంగారెడ్డి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, ఈఎంఈ రాజా బాబు, 102 ఈఎంఐ ప్రదీప్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దొంతిని పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**సీఎంకు స్వాగతం పలికిన ఉమ్మడి జిల్లా యంత్రాంగం**



నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి కీర్తిశేషులు కాంతమ్మ ఇటీవల మరణించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హన్మకొండ లోని పి జీ ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన మాతృ యజ్ఞం కార్యక్రమం లో పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. అంతకు ముందు హన్మకొండ లోగల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం లో గల హెలిప్యాడ్ వద్ద కు చేరుకున్న ముఖ్యమంత్రి కి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, నగర మేయర్, గుండు సుధారాణి, ముఖ్యమంత్రికి పుష్పగుచ్చాలను అందించి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.ఈ సందర్భం గా హెలి ప్యాడ్ వద్ద వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో పాటు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కూడా ముఖ్యమంత్రి కి పూల మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ(సీతక్క) , అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, లోక్ సభ సభ్యులు డా. కడియం కావ్య, బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామాచంద్రూ నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ,కడియం శ్రీహరి, కే ఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యానారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# మణికొండ లో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి



**గండిపేట, మహా:** మాజీ భారత రాష్ట్రపతి, భారతరత్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మణికొండ మున్సిపాలిటీలోని ఆర్కే సర్కిల్ వద్ద మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం గారు తన జీవితమంతా దేశ సేవకు అంకితం చేశారని. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన రంగంలో ఆయన చేసిన సేవలు భారతదేశాన్ని ప్రపంచంలో గౌరవ ప్రదమైన స్థానంలో నిలబెట్టాయన్నారు. యువత ఆయన ఆదర్శాలను అనుసరిస్తు దేశ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల నరేష్ గారు, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు గారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్ గారు, నాయకులు శ్రవణ్ కుమార్ గారు, గంగాధర్ గారు, దేవేందర్ గారు, నాగిరెడ్డి గారు, మధు గారు, శేషు గారు, వేణు గారు తదితరులు పాల్గొని అబ్దుల్ కలాం గారికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# ఇద్దరు స్క్రాప్ దొంగలను పోలీసులకు అప్పగింత






**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా కేకే ఓసి స్టోర్ లో దొంగతనానికి యత్నించిన ఇద్దరు దొంగలను సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని బుధవారం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు ఎస్ అండ్ పిసి జమేదార్ మర్రి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం రాత్రి 9:50 నిమిషాలకు కే.కే ఓసి స్టోర్ లోకి దొంగతనానికి వచ్చినట్లు తెలిపారు. ఇది గమనించిన ఎం.టి.ఎఫ్ సెక్యూరిటీ గార్డ్ పి సదానందం ఫోన్ చేసి సంబంధిత అధికారులకు తెలుపగా ఏంటీఎఫ్ టీం అక్కడికి వెళ్లి స్టోర్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో వెతకగా యార్డ్ లోపల దొంగతనానికి వచ్చిన ఇద్దరు దొంగలను పట్టుకోగా, మరొకరు పారిపోయినట్లు వెల్లడించారు. తదనంతరం దొంగలను ఎస్ అండ్ పి సి కంట్రోల్ రూమ్ లో ఉంచి, ఈరోజు మందమర్రి పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ అండ్ పి.సి సిబ్బందికి, ఎం.టి.ఎఫ్ సిబ్బందిని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ అభినందించారు.

# అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం

**ప్లానిటోరియం నిర్మాణ పనులు పునరుద్ధరించాలి .. నగర మేయర్ గుండు సుధారాణి**



**వరంగల్ మహా;** 15 వ ఫైనాన్స్ నిధుల కు చెందిన అభివృద్ధి పనుల పురోగతి తో పాటు ప్లానిటోరియం పునరుద్ధరణ పనుల గురించి బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో ఇంజనీరింగ్ అకౌంట్స్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యంగా ఆగి పోయిన ప్లానిటోరియం పనులను పునః ప్రారంభించి త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సత్యనారాయణ, అకౌంట్స్ అధికారి శివ లింగం, జే ఏ ఓ సరిత, ఈ ఈ లు రవికుమార్, సంతోష్ బాబు, మహేందర్, డి ఈ లు కార్తీక్ రెడ్డి, రోజా రాణి, రాగి శ్రీకాంత్, ఏ ఈ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్ మొత్తం తీసేయాలంటే..
# ఇక మూడేళ్లు ఆగాలి!

మీకు ఉద్యోగం లేదా.. రాజీనామా చేసి చాలాకాలమైందా? మూడేళ్లు కూడా దాటిపోయిందా.. అయితే ఇక మీరు మీ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్‌లో ఉన్న డబ్బు మొత్తం డ్రా చేసేసుకోవచ్చు. ఉద్యోగం లేకుండా ఉంటే రెండు నెలలు దాటగానే పీఎఫ్ అకౌంట్‌ను ఖాళీ చేసేందుకు ఇప్పటివరకూ అవకాశం ఉండగా... ఈపీఎఫ్ఓ బోర్డు తాజా నిర్ణయంతో అది మూడేళ్లకు పెరిగింది.



కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈపీఎఫ్ఓ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈ మార్పును ఆమోదించింది. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (EPFO) దీర్ఘకాలం పాటు ఉపాధి లేకుండా కొనసాగిన సందర్భాల్లోనే సభ్యులు తుది పరిష్కారాన్ని ఎంపిక చేసుకునేందుకు, భవిష్యనిధి ఖాతాలోని మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు అనుమతించింది. 12 నెలలుగా ఉద్యోగం లేని వారు (పదవీ విరమణ కాలం తీరకముందే ) ఈపీఎఫ్ తుది పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

36 నెలల పాటు ఉద్యోగం లేకుండా కొనసాగితే అప్పుడు భవిష్యనిధితోపాటు పెన్షన్ ఖాతాలో ఉన్న మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చని (EPF withdrawal) ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ప్రస్తుతం రెండు నెలలుగా ఉద్యోగం లేకుండా ఉన్న వారు నిధులను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఉంది. దీంతో చాలా మంది 2 నెలల తర్వాత ఖాతాను ఖాళీ చేస్తున్న నేపథ్యంలో.. వారి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈపీఎఫ్‌వో తెలిపింది.

### ఈపీఎఫ్ ఉపసంహరణలో కీలక మార్పులు

### ఇక మూడు రకాల ఉపసంహరణలే..

ఇంతకుముందు, ఈపీఎఫ్ నుండి పాక్షిక ఉపసంహరణకు అనుమతించే 13 నిబంధనలు ఉండేవి. వీటన్నింటినీ విలీనం చేస్తూ కేవలం మూడు నిబంధనలను ఉంచాలని సీబీటీ నిర్ణయించింది. అవి అత్యవసర పరిస్థితులు, గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు

### 100% వరకు విత్ డ్రాయల్స్

ఈపీఎఫ్ఓ సభ్యులు ఇప్పుడు ఉద్యోగి, యాజమాన్యం వాటాతో సహా ప్రావిడెంట్ ఫండ్‌లోని అర్హత కలిగిన బ్యాలెన్స్‌లో 100% వరకు ఉపసంహరించుకోవచ్చు.

### మరిన్ని విత్ డ్రాలు

సీబీటీ ఉపసంహరణ పరిమితులను సరళీకృతం చేసింది. విద్య సంబంధ అవసరాలకు ఇప్పుడు 10 సార్ల వరకు, వివాహం కోసం 5 సార్ల వరకు పీఎఫ్ ఉపసంహరించుకోవచ్చు. ఇవి గతంలో 3 సార్ల వరకే ఉండేవి.

### 12 నెలల తరువాత పాక్షిక ఉపసంహరణ

అన్ని పాక్షిక ఉపసంహరణలకు కనీసం ఉండాల్సిన సర్వీస్ కాలాన్ని ఏకరీతిగా 12 నెలలకు తగ్గించారు.

### ప్రత్యేక పరిస్థితులకు ఎలాంటి కారణం అవసరం లేదు

'ప్రత్యేక పరిస్థితులలో' పీఎఫ్ విత్‌డ్రా చేయాలంటే ఇంతకు ముందు కారణాలు అంటే ప్రకృతి వైపరీత్యాలు, లాకౌట్లు / సంస్థల మూసివేత, నిరంతర నిరుద్యోగం, అంటువ్యాధి వ్యాప్తి మొదలైనవి సభ్యుడు స్పష్టం చేయాల్సి వచ్చేది. ఇప్పుడు, సభ్యుడు ఈ కేటగిరీ కింద ఎటువంటి కారణాలు పేర్కొనకుండానే దరఖాస్తు చేసుకోవచ్చు.

### 25 శాతం కనీస బ్యాలెన్స్ తప్పనిసరి

సభ్యుల ఖాతాలో 25% కాంట్రిబ్యూషన్‌ను కనీస బ్యాలెన్స్‌గా తప్పనిసరిగా ఉంచాలని నిబంధన తీసుకొచ్చారు.

### 100% ఆటో సెటిల్‌మెంట్

సభ్యులకు ఎక్కువ సౌలభ్యం కల్పించేందుకు సెటిల్‌మెంట్ నిబంధనలను ఈపీఎఫ్‌వో సరళీకృతం చేసింది. ఎటువంటి డాక్యుమెంటేషన్ అవసరం లేకుండా, పాక్షిక ఉపసంహరణ కోసం క్లెయిమ్‌ల 100% ఆటో సెటిల్‌మెంట్‌ను ఈపీఎఫ్‌వో అనుసరించనుంది.

### ముందస్తు ఫైనల్ సెటిల్‌మెంట్, పెన్షన్ ఉపసంహరణ

పదవీ విరమణ కాలం తీరకముందే ముందస్తు ఈపీఎఫ్ ఫైనల్ సెటిల్మెంట్‌ను పొందే వ్యవధిని ప్రస్తుతం ఉన్న 2 నెలల నుండి 12 నెలలకు, ఫైనల్ పెన్షన్ ఉపసంహరణను 2 నెలల నుండి 36 నెలలకు పెంచాలని సీబీటీ నిర్ణయించింది.



## మైక్రోసాఫ్ట్ మొదటి ఏఐ ఇమేజ్ జనరేటర్ విడుదల

టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కృత్రిమ మేధ రంగంలో మరో కీలక ముందడుగు వేసింది. సంస్థ పూర్తిగా అంతర్గతంగా శిక్షణ ఇచ్చిన తన మొదటి ఏఐ ఇమేజ్ జనరేటర్ 'మై ఇమేజ్-1'ను విడుదల చేసింది. ఇప్పటివరకు ఈ విభాగంలో ఓపెన్‌ఏఐపై ఆధారపడుతుండడాన్ని తగ్గించుకునేందుకు మైక్రోసాఫ్ట్ కృషి చేస్తోంది. 'MAI-Image-1 మోడల్ ఫొటోరియలిస్టిక్ ఇమేజరీని ఉత్పత్తి చేయడంలో మెరుగ్గా పని చేస్తుంది. ఫొటోలో లైటింగ్ పరిస్థితులు, నీటిపై ప్రతిబింబాలు, ప్రకృతి దృశ్యాలు అత్యంత వాస్తవికంగా ఉంటాయి. భారీ ఎల్ఎల్ఎంలు వాడుతూ నెమ్మదిగా అవుట్‌పుట్ ఇచ్చే మోడళ్లతో పోలిస్తే ఇది చాలా మంచి ఫలితాలు ఇస్తుంది. అత్యంత వాస్తవిక అవుట్‌పుట్‌లను సాధించడానికి ఇప్పటికే నిపుణుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నాం' అని కంపెనీ తెలియజేసింది. మైక్రోసాఫ్ట్ MAI-Image-1 ఇప్పటికే ప్రముఖ ఏఐ బెంచ్‌మార్క్ అయిన ఎల్ఎంఅరెలో టాప్ 10లో స్థానం సంపాదించింది. LMArenaలో ఏఐ అవుట్‌పుట్‌ల ఆధారంగా వివిధ మోడళ్లను పోల్చి ఉత్తమమైన వాటికి ఓటు వేస్తారు. ఏఐ ఇమేజ్ జనరేషన్ విభాగంలో ఓపెన్‌ఏఐ, గూగుల్ వంటి సంస్థలు ఇప్పటికే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చిన ఈ టెక్నాలజీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ రంగంలో సంస్థ తనదైన ముద్ర వేయాలని ప్రయత్నిస్తోంది. మరోవైపు ఓపెన్‌ఏఐ తన సోరా(Sora) 2 టూల్‌ను ఉపయోగించి వీడియోలను సృష్టించే యాప్‌ను ఇప్పటికే అమెరికా, కెనడాలోని యాపిల్ యాప్ స్టోర్‌లో ప్రారంభించింది.



## యూఏఈలో 6జీ కనెక్టివిటీ టెస్ట్
# విజయవంతం

యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) 6జీ కనెక్టివిటీ పరీక్షల్లో రికార్డు స్థాయిలో 145 గిగాబిట్స్ పర్ సెకన్ ఇంటర్‌నెట్ వేగాన్ని సాధించినట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వెలిశాయి. ఈ టెక్నాలజీ టెలికమ్యూనికేషన్స్ రంగంలో కీలక మైలురాయిగా నిలవనుంది. కనెక్టివిటీలో అసాధారణ వేగం, అతి తక్కువ జాప్యం వంటి అంశాలు భవిష్యత్ డిజిటల్ ప్రపంచానికి సరికొత్త మార్గాన్ని సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ కూడా 6జీ టెక్నాలజీ అభివృద్ధిలో చురుకుగా ముందుకు సాగుతోంది.


**భారత్‌లో పరిశోధనలు**

భారతదేశం కేవలం 6జీ టెక్నాలజీని స్వీకరించే దేశంగా కాకుండా దాని రూపకల్పన, అభివృద్ధి, ప్రమాణాలను నిర్దేశించడంలో ప్రపంచానికి నాయకత్వం వహించే దేశంగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. దాంతో భారత్ 6జీ విజన్‌ను ప్రారంభించింది. 2023 మార్చి 23న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత్ 6జీ విజన్ పత్రాన్ని ఆవిష్కరించారు. 2030 నాటికి ఈ టెక్నాలజీలను రూపొందించి దేశీయంగా అమలు చేయాలనేది దీని ముఖ్య ఉద్దేశం. దేశీయ పరిశ్రమ, విద్యాసంస్థలు, జాతీయ పరిశోధనా సంస్థలు, ప్రమాణాల సంస్థల సహకారంతో 2023 జులై 3న భారత్ 6జీ కూటమిని ప్రారంభించారు. భారత్ 6జీ విజన్‌కు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి ఇది ఒక వేదికగా పనిచేస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాల చర్చల్లో చురుకుగా పాల్గొనడం, పరిశోధనలకు నిధులు సమకూర్చడం దీని విధుల్లో భాగం. టెలికాం టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ పథకం కింద 6జీ టెక్నాలజీకి సంబంధించిన 104కి పైగా పరిశోధన ప్రాజెక్టులకు రూ.275.88 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. దేశంలోని కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లో 6జీకి సిద్ధంగా ఉండే పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి 100 5జీ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఇవి భవిష్యత్తులో 6జీ పరిశోధనలకు వేదికగా మారుతాయి. భారత్‌లో పరిశోధనలు భారతదేశం కేవలం 6జీ టెక్నాలజీని స్వీకరించే దేశంగా కాకుండా దాని రూపకల్పన, అభివృద్ధి, ప్రమాణాలను నిర్దేశించడంలో ప్రపంచానికి నాయకత్వం వహించే దేశంగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. దాంతో భారత్ 6జీ విజన్‌ను ప్రారంభించింది. 2023 మార్చి 23న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత్ 6జీ విజన్ పత్రాన్ని ఆవిష్కరించారు. 2030 నాటికి ఈ టెక్నాలజీలను రూపొందించి దేశీయంగా అమలు చేయాలనేది దీని ముఖ్య ఉద్దేశం. దేశీయ పరిశ్రమ, విద్యాసంస్థలు, జాతీయ పరిశోధనా సంస్థలు, ప్రమాణాల సంస్థల సహకారంతో 2023 జులై 3న భారత్ 6జీ కూటమిని ప్రారంభించారు. భారత్ 6జీ విజన్‌కు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి ఇది ఒక వేదికగా పనిచేస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాల చర్చల్లో చురుకుగా పాల్గొనడం, పరిశోధనలకు నిధులు సమకూర్చడం దీని విధుల్లో భాగం. టెలికాం టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ పథకం కింద 6జీ టెక్నాలజీకి సంబంధించిన 104కి పైగా పరిశోధన ప్రాజెక్టులకు రూ.275.88 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. దేశంలోని కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లో 6జీకి సిద్ధంగా ఉండే పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి 100 5జీ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఇవి భవిష్యత్తులో 6జీ పరిశోధనలకు వేదికగా మారుతాయి.

**ఈ టెక్నాలజీ వివిధ దేశాల పరిశోధనలు**

ప్రస్తుతానికి ప్రపంచంలో ఏ దేశంలోనూ పూర్తిగా వాణిజ్యపరమైన 6జీ నెట్‌వర్క్ వాడుకలో లేదు. 6జీ సాంకేతికతను 2030 నాటికి వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి, పరిశోధన (R&D)లో వివిధ దేశాలు, టెక్ కంపెనీలు చురుగ్గా పోటీ పడుతున్నాయి.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



## ఛీ.. ఈ చెత్త ఏంటి? అసహ్యమేస్తోంది.. ఎందుకిలా చేశారు?: ట్రంప్ ఫైర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సంతోషం వచ్చినా.. కోపం వచ్చినా అస్సలు ఆగరు. తాజాగా టైమ్ మ్యాగజైన్ ఆయన్ని పొడుగుతూ ఓ కథనం ఇచ్చింది. అయినా కూడా ట్రంప్‌కు బాగా కోపం వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. టైమ్ మ్యాగజైన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సొంత సోషల్ మీడియా సోషల్ ట్రూత్‌లో ఓ పోస్ట్ పెట్టారు. కవర్ పేజీపై తన ఫొటోలో జుట్టు సరిగా కనిపించకపోవడమే అందుకు ప్రధాన కారణం. ఇంతకీ ఆయన ఆ పోస్టులో ఏమన్నారంటే.. నా గురించి వచ్చిన కథనం కొంతవరకు బాగానే ఉంది. కానీ కవర్‌పై ఉన్న ఫోటో మాత్రం చరిత్రలోనే చెత్త ఫోటో. వాళ్లు నా జుట్టును కనిపించకుండా చేశారు. నా జుట్టును తలపై చిన్న తలపాగా.. ఏదో తేలియాడుతున్నట్లుగా చూపించారు. ఇది చాలా విచిత్రంగా అనిపించింది. నాకు ఎప్పుడూ కింది యాంగిల్ నుంచి తీసే ఫోటోలు నచ్చవు. ఇది మాత్రం చాలా చాలా చెత్త ఫొటో. అందుకే దీన్ని తప్పక విమర్శించాలి. అసలు వాళ్లు ఏం చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు?'' అంటూ ట్రంప్ మేనేజ్‌మెంట్‌పై మండిపడ్డారు. ఇదిలా ఉంటే టైమ్ మ్యాగజైన్‌ను ట్రంప్ కోపడ్డడం ఇదే తొలిసారేం కాదు. ఫిబ్రవరిలో.. డోజ్ చీఫ్‌గా ఉన్న ఎలాన్ మస్క్ ఓవల్ ఆఫీస్‌లో రెజల్యూట్ డెస్క్ మీద కూర్చున్నట్లు ఓ ఫొటోను ప్రచురించింది. ట్రంప్ ఆ ఫొటోపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు టైమ్ మ్యాగజైన్ ఇంకా నడుస్తుంది అనుకోలేదు అంటూ వెటకారం ప్రదర్శించారు. అదే సమయంలో.. అయితే మస్క్ పని తీరును ఆ సమయంలో ఆయన ప్రశంసించారు. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ట్రంప్ మీద టైమ్ మాగజైన్ His Triumph అనే శీర్షికతో కవర్ పేజీ ఇచ్చింది. గాజా శాంతి ఒప్పందంలో ఆయన చేసిన కృషికిగానూ ఈ కథనం ప్రచురించింది. ఈ ఒప్పందంతోనే 20 మంది ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడుదల చేయగా.. ఇజ్రాయెల్ సుమారు 2,000 మంది పాలస్తీనా ఖైదీలను, 360 మంది పాలస్తీనీయుల మృతదేహాలను విడుదలకు సిద్ధమైంది. అయితే ఈ ఏడాదిలోనే తాను పలు యుద్ధాలను ఆపానంటూ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి డిమాండ్ చేయగా.. రూల్స్ అడ్డు రావడంతో ఆయన కల నెరవేరలేదు!. దీంతో వచ్చే ఏడాదైనా దక్కవచ్చనే ఆశ పెట్టుకున్నారాయన.

# శాంతి చర్చల వేళ సంచలనం..



**గాజా:** ఇజ్రాయెల్ బందీల విడుదల అనంతరం హమాస్ సాయుధ గ్రూపు చూపు ఇప్పుడు ప్రత్యర్థి వర్గాలపై పడింది. గాజా ప్రాంతంపై పట్టు తిరిగి సాధించేందుకు విరోధి సాయుధ శ్రేణులను ఏరి పారేసే పనికి పూనుకుంది. ఈ పరిణామం అమెరికా మధ్యవర్తిత్వంతో నెలకొన్న కాల్పుల విరమణ మనుగడపై కొత్త అనుమానాలను తెరపైకి తెస్తోంది. ఇప్పటికైనా శాంతి నెలకొందని సంతోష పడుతున్న పాలస్తీనియన్లను హమాస్ వైఖరి భయపెడుతోంది. వివరాల ప్రకారం.. హమాస్ ఫైరింగ్ స్క్వాడ్ తాజాగా ప్రత్యర్థి వర్గాలకు చెందిన 8 మందిని కాల్చి చంపినట్లు సమాచారం. మొత్తమ్మీద 50 మందిని ఇప్పటి వరకు మట్టుబెట్టి ఉంటుందని వైనెట్ వార్తా సంస్థ తెలిపింది. అంతర్గత భద్రతను హమాస్ చూసుకుంటుందని ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపట్లోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నట్లు ఆ సంస్థ వ్యాఖ్యానించింది. కళ్లకు గంతలు కట్టి, బంధించిన వారిని ముసుగులు ధరించిన హమాస్ సభ్యులు దాదాపు బహిరంగంగానే కాలుస్తున్నట్లుగా ఉన్న వీడియోను షఫఖ్ న్యూస్ ప్రసారం చేసింది. దీనిపై స్పందించిన హమాస్.. ఇజ్రాయెల్ బలగాలకు సహకరించడంతోపాటు నేర కార్యకలాపాల్లో పాల్గొన్నందుకే వీరిని శిక్షించామని తెలిపింది. అయితే, హమాస్ చర్యలు గాజాలోని డొగ్‌ముష్ వంటి గ్రూపులతో హింసాత్మక ఘర్షణలకు దారి తీస్తున్నాయి. డొగ్‌ముష్ వర్గం గాజాలోని అత్యంత శక్తివంతమైన సాయుధ గ్రూపుల్లో ఒకటి. హమాస్ భద్రతా విభాగంతో జరిగిన కాల్పుల్లో డొగ్‌ముష్‌కు చెందిన 52 మంది చనిపోయారని వైనెట్ పేర్కొంది. ఈ పోరులో 12 మంది హమాస్ సాయుధులు కూడా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో హమాస్ సీనియర్ నేత బస్సెమ్ నయీమ్ కుమారుడు కూడా ఉన్నట్లు వైనెట్ పేర్కొంది. ప్రత్యర్థుల ప్రాంతాల్లోకి గుట్టుచప్పుడు కాకుండా అంబులెన్సుల్లో వెళ్లిన హమాస్ శ్రేణులు శత్రు సంహారం చేస్తున్నారని తెలిపింది. పౌరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించేలా వ్యవహరిస్తోందంటూ హమాస్‌పై విమర్శలు వస్తున్నాయి.

### కొన్ని గ్రూపులకు ఇజ్రాయెల్ సాయం

అత్యంత అధునాతన, భారీ ఆయుధాలు కలిగిన డొగ్‌ముష్‌కు ఎప్పట్నుంచో హమాస్‌తో విభేదాలున్నాయి. ఈ గ్రూపునకు ఇజ్రాయెల్ మద్దతుందనే అనుమానాలు కూడా ఉన్నాయి. రఫాలోని యాసెర్ అబూ షబాబ్ సారథ్యంలోని గ్రూపు సహా గాజాలోని పలు ముఠాలకు పరిమితంగా సాయం, ఆయుధాలు అందిస్తున్నట్లు ఇజ్రాయెల్ ఇటీవల ప్రకటించడం గమనార్హం. ఇటీవల హమాస్ శ్రేణులు యాసెర్ అబూ షబాబ్ సన్నిహితుడొకరిని చంపేసినట్లు ప్రకటించుకున్నాయి. షబాబ్‌ను వదిలేది లేదని కూడా తెలిపాయి. హమాస్‌లోని యారో యూనిట్ హింసాత్మక ప్రతీకార చర్యల్లో ఆరితేరిందని నిపుణులు అంటున్నారు. ఇన్నాళ్లూ సొరంగాల్లో రహస్యంగా నక్కుతూ పనిచేసిన హమాస్ సాయుధులు ఇప్పుడు తమ శత్రువుల అంతం చూసే పనిలో నిమగ్నమైనట్లు చెబుతున్నారు. శాంతి ఒప్పందాన్ని అనుసరించే ఉద్దేశం హమాస్ లేనట్లు కనిపిస్తోందంటున్నారు. 'ఆయుధాలను ఉంచుకోవాలనే ఉద్దేశంతోనే హమాస్ ఇప్పటికీ ఉంది. నిరాయుధీకరణ రెండో దశ చర్చలు ప్రారంభమయ్యేటప్పటికి గాజాపై పట్టు నిలుపుకోవాలనే పట్టుదలతో ఉంది'అని విశ్లేషకులు అంటున్నారు.

## ఎన్నికల బరిలో ప్రముఖ గాయకుని భార్య?



**పట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజకీయ నేతలతో పాటు పలువురు గాయనీగాయకులు, నటులు ఉత్సాహం చూపిస్తున్నారు. తాజాగా భోజ్‌పురి గాయకుడు, నటుడు ఖేసరి లాల్ యాదవ్ ఈ ఎన్నికల్లో తన పాత్రపై ఏమిటనేది వెల్లడించారు. తాను ఆర్జేడీ తరపున ప్రచారం చేయనున్నానని, తన భార్యను ఎన్నికల్లో అభ్యర్థిగా నిలబెట్టాలని అనుకుంటున్నానని తెలిపారు. భోజ్‌పురి నటుడు ఖేసరి లాల్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తన భార్య చేత పోటీ చేయించాలని అనుకుంటున్నానని, ఇందుకోసం ఆమెను ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ఒకవేళ ఆమె ఇందుకు అంగీకరిస్తే, తమ నామినేషన్ దాఖలు చేస్తామని, లేనిపక్షంలో తాను ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. ఇటు తేజస్వి యాదవ్, అటు అఖిలేష్ యాదవ్‌తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, పోటీ చేసే విషయంలో రెండు పార్టీల నుండి తనపై ఒత్తిడి ఉన్నదని ఖేసరి లాల్ యాదవ్ పేర్కొన్నారు. తన భార్య అంగీకరిస్తే, ఆమె చేత ఖచ్చితంగా పోటీ చేయిస్తానని తెలిపారు.

# చైనాను అడ్డుకోవడానికి భారత్ మద్దతు కావాలి: స్కాట్ బెసెంట్

**వాషింగ్టన్:** అమెరికా, చైనా మధ్య టారిఫ్‌ల కారణంగా ట్రేడ్ వార్ కొనసాగుతోంది. అరుదైన ఖనిజాలపై చైనా ఆధిపత్యం విషయంలో అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో చైనాకు వ్యతిరేకంగా భారత్ మద్దతు ఇవ్వాలని ఆశిస్తున్నట్లు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో చైనాను టార్గెట్ చేసి.. ప్రపంచ పంపిణీ వ్యవస్థలపై చైనా గురిపెట్టిందని ఆరోపణలు గుప్పించారు. అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ తాజాగా ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..'అమెరికా ప్రపంచ శాంతి, ఆర్థిక స్థిరత్వం కోసం కృషి చేస్తోంది. ఇదే సమయంలో చైనా ప్రపంచంలో వార్ ఎకానమీకి ఫైనాన్స్ చేస్తోందని ఆరోపించారు. అరుదైన ఖనిజాల(rare Metals) ఉత్పత్తి, సరఫరాపై చైనా పెంచుకుంటున్న ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో భారత్, యూరోపియన్ దేశాలు అమెరికాతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. అయితే, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరికరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, రక్షణ సామగ్రి తయారీలో ఈ ఖనిజాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. చైనా ఈ వనరులలో దాదాపు 70% సరఫరాను నియంత్రిస్తుండటంతో, అమెరికా దీనిని వ్యూహాత్మక ముప్పుగా చూస్తోంది. ఇక, అక్టోబర్ 9 నుంచి అరుదైన ఖనిజాల ఎగుమతులకు అనుమతులు తప్పనిసరి చేస్తూ చైనా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. ఆయన మాటల్లో స్పష్టంగా చైనాపై వ్యతిరేక ధోరణి కనిపించింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్య వివాదాలు, సాంకేతిక పరమైన పోటీ, దక్షిణ చైనా సముద్రం వివాదం వంటి అంశాలు ఇప్పటికే ఉద్రిక్తతలను పెంచాయి. ఇప్పుడు అరుదైన ఖనిజాల విషయం కూడా ఆ వివాదానికి కేంద్ర బిందువుగా మారాయి. అమెరికా ఈ వనరుల సరఫరాను చైనా నుండి స్వతంత్రంగా మార్చుకునే ప్రయత్నంలో ఉంది. భారత్ ఈ రంగంలో విస్తారమైన వనరులు కలిగి ఉండటంతో, అమెరికా వ్యూహాత్మకంగా భారత్ వైపు మొగ్గు చూపుతోంది. మరోవైపు, అమెరికా ఇటీవల భారత్‌పై కొన్ని ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించడం, వాణిజ్య పరమైన అడ్డంకులు సృష్టించడం విమర్శలకు దారితీసింది. టారిఫ్‌లతో భారత్ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తూనే, చైనాపై పోరులో మద్దతు కోరడం విరుద్ధ ధోరణిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. అయినప్పటికీ, ఖనిజాల రంగంలో భారత్ భాగస్వామ్యం అమెరికాకు వ్యూహాత్మకంగా అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు.





# రెబల్ ఫ్యాన్స్ బీ రెడీ..

## కాటేరమ్మ కొడుకు మళ్లీ వస్తున్నాడు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు గుడ్ న్యూస్. రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబర్ 23న అభిమానులకు అదిరిపోయే ట్రీట్ రాబోతుంది. ప్రభాస్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'సలార్: పార్ట్ 1 – సీజ్‌ఫైర్' మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. దీనికి సంబంధించి హోంబలే ఫిలిమ్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2023 డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను అందుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.700 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా రీ రిలీజ్ చేయబోతున్నట్లు తెలుస్తుంది. 'సలార్' మాత్రమే కాకుండా ప్రభాస్ నటించిన 'ఈశ్వర్', 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'పౌర్ణమి' వంటి చిత్రాలు కూడా రీ రిలీజ్ కాబోతున్నట్లు తెలుస్తుంది.

# ఫ్లాష్‌బ్యాక్‌లో యాక్షన్



ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది.

ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ కోసం ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లోకి మారారని టాక్. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు సినిమాలో హైలెట్‌గా నిలవనున్నాయట. ఇదిలా ఉంటే... ఈ సినిమాకి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రం 2026 జూన్ 25న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.


'వార్ 2' రికార్డ్ : హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదలైంది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఈ నెల 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అత్యధిక మంది వీక్షించిన చిత్రాల జాబితాలో 'వార్ 2' చిత్రం టాప్‌లో ఉన్నట్లు ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ తెలిపింది. ఈ నెల 6 నుంచి 12 వరకూ 3.5 మిలియన్ల మంది వీక్షించినట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో గత వారం ఇండియాలోనే ఎక్కువమంది చూసిన సినిమాగా 'వార్ 2' నిలిచింది.



## ప్రెగ్నెన్సీతో

# పరిణీతి చోప్రా..

బాలీవుడ్ భామ పరిణితి చోప్రా ప్రస్తుతం పెద్దగా సినిమాలు చేయట్లేదు. 2023లో రాజకీయ నాయకుడితో పెళ్లిబంధంలోకి అడుగుపెట్టిన ముద్దుగుమ్మ.. మెల్లమెల్లగా సినిమాలు చేయడం తగ్గించింది. గతేడాది అమర్ సింగ్ చంకీలా చిత్రంలో దిల్జీత్ దోసాంజ్ సరసన కనిపించింది. ప్రస్తుతం కేవలం ఓ సినిమాతో పాటు వెబ్ సిరీస్‌లో నటించింది. సినిమాల సంగతి పక్కన పెడితే.. ఈ ఏడాది ఆగస్టులో అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పింది. తాను ప్రెగ్నెన్సీతో ఉన్న విషయాన్ని రివీల్ చేసింది. ఈ శుభవార్తను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. త్వరలోనే హీరోయిన్ పరిణితి చోప్రా బిడ్డకు జన్మనివ్వనుంది. ఈ నేపథ్యంలోనే పరిణీతికి మరో స్టార్ హీరోయిన్ గిఫ్ట్‌ను పంపి సర్‌ప్రైజ్ ఇచ్చింది. డెలివరీకి ముందే పుట్టబోయే బిడ్డ కోసం బహుమతి పంపిన విషయాన్ని పరిణీతి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇంతకీ ఆ వివరాలేంటో చూసేద్దాం. మొదటి బిడ్డ కోసం ఎదురు చూస్తున్న పరిణీతి చోప్రాకు స్టార్ హీరోయిన్ అలియా భట్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. తన సొంత బ్రాండ్ అయిన ఎడ్-ఎ-మమ్మా నుంచి సరికొత్త హ్యాంపర్‌ను గిఫ్ట్‌గా పంపింది. ఆలియా భట్ బహుమతిపై పరిణీతి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పోస్ట్ చేసింది. తన బిడ్డకోసం గిఫ్ట్ పంపినందుకు ధన్యావాదాలు తెలిపింది. కాగా.. పరిణితి చోప్రా ఇటీవలే ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో కనిపించింది. ఆ తర్వాత తాను గర్భంతో ఉన్నట్లు శుభవార్తను పంచుకుంది. అంతేకాకుండా పరిణీతి చోప్రా ఇటీవలే తన యూట్యూబ్ ఛానెల్‌ను తిరిగి ప్రారంభించింది. ఓ వీడియోను సైతం తన ఛానెల్‌లో అప్‌లోడ్ చేసింది. బాలీవుడ్‌లో ఆమె నటించిన ఇష్క్ జాదే, శుద్ద్ దేశీ రొమాన్స్, మేరీ ప్యారీ బిందు, కేసరి, అమర్ సింగ్ చమ్కీలా లాంటి బాలీవుడ్ చిత్రాలు పరిణీతి చోప్రాకు మంచి పేరు తీసుకొచ్చాయి.



# ఓటీటీలోకి పొలిటికల్ మూవీ

ఏడాదిలో కచ్చితంగా మూడు నాలుగు సినిమాలైన తీసే విజయ్ ఆంటోనీ.. ఈ ఏడాది ఇప్పటికే 'మార్గన్' అనే మూవీతో వచ్చాడు. థియేటర్లలో ఆడనప్పటికీ ఓటీటీలోకి వచ్చిన తర్వాత మంచి రెస్పాన్స్ వచ్చింది. గత నెలలో 'భద్రకాళి' అనే డబ్బింగ్ బొమ్మతో వచ్చాడు. థియేటర్లలో దీనికి పెద్దగా రెస్పాన్స్ రాలేదు. దీంతో ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైపోయింది. స్వతహాగా సంగీత దర్శకుడైన విజయ్ ఆంటోనీ.. 'బిచ్చగాడు'తో హిట్ కొట్టి తమిళంతో పాటు తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. తర్వాత చాలా సినిమాలు తీస్తున్నాడు గానీ వర్కౌట్ కావట్లేదు. ఇప్పుడు అరుణ్ ప్రభు దర్శకత్వంలో 'భద్రకాళి' అనే పొలిటికల్ థ్రిల్లర్ చేశాడు. ఇందులో హీరోగా నటించడంతో పాటు సంగీతం, నిర్మాణం కూడా విజయ్ ఆంటోనీదే. సెప్టెంబరు 5న ఈ చిత్రం థియేటర్లలోకి రాగా.. వచ్చే శుక్రవారం(అక్టోబరు 24) నుంచి హాట్‌స్టార్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి రానుంది. ఈ మేరకు పోస్టర్ రిలీజ్ చేశారు. 'భద్రకాళి' విషయానికొస్తే.. కిట్టు (విజయ్ ఆంటోనీ) సెక్రటేరియట్‌లో ఓ పవర్ బ్రోకర్. ప్రభుత్వంలోని ఎలాంటి పని అయినా సరే చిటికలే చేసి పెడుతుంటాడు. అలా ఓసారి కేంద్ర మంత్రి లతకు సంబంధించిన రూ.800 కోట్ల భూముల వ్యవహారంలో వేలు పెడతాడు. అంతా సవ్యంగానే జరిగినా చివరలో ఓ ఎమ్మెల్యే హత్య జరగడం, దాని వల్ల లతకు రాజకీయంగా కొన్ని సమస్యలు ఎదురవుతాయి. ఏం జరిగిందా అని ఆరా తీయగా.. కిట్టు గురించి, అతడు వెనకేసిన రూ.6,200 కోట్ల గురించి తెలుస్తుంది. అసలు కిట్టు ఎవరు? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.

# నా కూతురిని ఒకరి భార్యగా పెంచలేదన్నాడు.. సుస్మితా సేన్



బాలీవుడ్ భామ సుస్మితా సేన్ పరిచయం అక్కర్లేని పేరు. తనకు 18 ఏళ్ల వయసులోనే విశ్వసుందరిగా ఘనతను సొంతం చేసుకుంది. తమిళ సినిమాతో ఇండస్ట్రీలో అడుగుపెట్టిన సుస్మితా సేన్.. బాలీవుడ్, టాలీవుడ్‌లోనూ నటించింది. తెలుగులో నాగార్జునతో కలిసి 'రక్షకుడు' అనే సినిమాలో హీరోయిన్‌గా చేసింది. ప్రస్తుతం వెబ్ సిరీస్‌ల్లో నటిస్తోంది. అయితే స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సుస్మితా సేన్ తన వ్యక్తిగత జీవితం మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. పలువురితో డేటింగ్ చేసిన ఆమె..ఏ ఒక్కరిని పెళ్లాడలేదు. ఆమె రిలేషన్స్ మున్నాళ్ల ముచ్చటగానే మారాయి. ప్రేమాయణం కొనసాగించడం.. కొన్నేళ్లకు బ్రేకప్ ఆమె లైఫలో సర్వసాధారణంగా మారిపోయింది. అయితే సుస్మితా సేన్ పెళ్లి చేసుకోకుండానే ఇద్దరు పిల్లలకు తల్లిగా మారింది. 24వ ఏట రీనీ అనే అమ్మాయిని దత్తత తీసుకుని పెళ్లి కాకుండానే తల్లి స్థానం తీసుకుంది. తన తల్లిదండ్రుల మద్దతుతో కొన్నాళ్లకు ఇంకో బిడ్డ (అలీసా)నూ దత్తత తీసుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన సుస్మితా సేన్ పిల్లలను దత్తత తీసుకోవడంలో ఎదురైన ఇబ్బందులను పంచుకుంది. తన తండ్రి సుబీర్ సేన్ తిరుగులేని మద్దతువల్లే ఇది సాధ్యమైందని తెలిపింది. 2000 సంవత్సరంలో రెనీని దత్తత తీసుకున్నప్పుడు జరిగిన సంఘటలను పంచుకుంది. ఒంటరి మహిళలు పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవడాన్ని జువెనైల్ జస్టిస్ చట్టాలు ఎప్పుడు నిషేధించలేదని వెల్లడించింది. సుస్మితా మాట్లాడుతూ.. 21 ఏళ్ల వయసులో చట్టబద్ధంగా ఏం చేయాలో నాకు తెలుసు. రెనీ కోసం చట్టపరమైన పోరాటం చేసే సమయంలో నాలో ఆందోళన మొదలైంది. రెనీ విషయంలో కుటుంబ కోర్టు నాకు అనుకూలంగా తీర్పు ఇవ్వకపోతే.. వారు బిడ్డను తిరిగి తీసుకుంటారు. అప్పటికే రెనీ నన్ను అమ్మా అని పిలవడం ప్రారంభించింది. అప్పు నాకు ఓ ఐడియా వచ్చింది. పాపను తీసుకుని కారులో నువ్వు పారిపో అని నాన్నతో చెప్పాను. మనం అలాంటి పని చేయకూడదు. కానీ బిడ్డను మా నుంచి ఎవరు తీసుకోలేరని గట్టిగా అనుకున్నాం."అని అన్నారు. అయితే ఈ కేసు మాకు అనుకూలంగా రావడంతో తన తండ్రి పెద్ద పాత్ర పోషించారని పంచుకుంది. నా తండ్రి వల్లే నాకిప్పుడు పిల్లలు ఉన్నారు.. నా బిడ్డను పోషించడానికి కోర్ట్ చెప్పినట్లుగా సగం ఆస్తిని రెనీ పేరిట రాసిచ్చారని తెలిపింది. ఆ సమయంలో న్యాయమూర్తి తనను ఉద్దేశించి చేసిన కామెంట్స్‌ను ప్రస్తావించింది. మంచి కుటుంబంలోని అబ్బాయి ఎవరూ కూడా నన్ను వివాహం చేసుకోవడానికి ఇష్టపడరని న్యాయమూర్తి నా తండ్రిని కూడా హెచ్చరించారని వివరించింది. నేను ఆమెను ఎవరి భార్యగా పెంచలేదని నాన్న జడ్జితో చెప్పారని వెల్లడించింది. ఆ తీర్పే నా జీవితాన్ని మార్చేసిందని సుస్మితా సేన్ తెలిపింది. కాగా.. సుస్మితా సేన్ 1975 నవంబర్ 19న ఓ బెంగాలీ కుటుంబంలో జన్మించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com